ఊరబావి

ఊరబావి చుట్టూ జనం మూగారు. తొంగిచూచినవాళ్ళు ముఖాలు చిట్లించుకొని వికారంగా కనిపిస్తున్నారు. బారెడు పొద్దెక్కినా బావి గచ్చుమీద నీటి చెమ్మ లేదు. బావి పక్క మురుగు గుంటలో బ్రతుకు తెల్లవార్చుకొంటున్న కప్ప ఒకటి కుంట వెలుపలకు వచ్చి, తల బైటికి వెళ్ళబెట్టి చూస్తూ ఉంది

జనం వస్తున్నారు, వెళుతున్నారు తాము పుట్టి భూమిమీద పడ్డాక ఇటువంటిది చూళ్ళేదు, వినలేదు అని వృద్ధులే చెబుతున్నారు. మునసబు రావడంతోనే కొందరు తప్పుకొని తోవ ఇచ్చారు. మునసబు తొంగి చూశాడు. నీళ్ళు ఎర్రడాలు దిరిగాయి. నీళ్ళమీద పూర్తిగా మునక్కుండా, తేలకుండా, గిలకలకు కట్టిన మోకులు కారణంగా నాలుగు కాళ్ళూ పైకి ఎగదట్టిన, తోలు ఒలిచేసిన ఎద్దు దట్టైం! మాంసంలోని సారం నీళ్ళలోకి దిగిపోతే పాలిపోయిన దట్టైం!

"ఎవుడీ పన్జేసింది?" మునసబు కళ్ళల్లోంచి దిగివచ్చిన కోపం మీసాలమీదుగా పాకి పెదాల కొసల్లోంచి జారి, పళ్ళమధ్య పదునుదేలుతూ ఉంది. మునసబు ఆ ఆలోచనలోనే ఇంటికి చేరుకున్నాడు. కరణం, వెట్టివాళ్ళు, రైతులు వెంట ఉన్నారు. ఏ జీతగాడూ ఆ చుట్టుపక్కల లేడు.

"ఎవుడు చేసుంటాడీ పని?" అందరికీ ఇదే ప్రశ్న! కొందరికి చూచాయగా 'వాడే' అవిపించింది. 'అన్నిటికీ ఆడే అంటం ఏం బాగుంటది' అనీ అనిపించింది. అనుమానం స్థిరమయింది. రాముడి కొడుకు చిదంబరం ఇంత చేసి ఉంటాడు.

మునసబు తన ఇంటి ప్రహారీ ప్రక్క అరుగుమీద కూర్చున్నాడు.

రైతులు కొందరు ఎదటి వీథిలో నిలబడ్డారు. వెట్టి మనిషి తెచ్చిన చుట్ట ముట్టించుకొని, గవదలు చొట్టలు పడేటట్లు పొగపీల్చి, దవడలు ఉబ్బించి పొగ వదలి, చుట్ట కొరికి కాండ్రించి ఉమ్మివేసి "వాడే!" అన్నాడు. అని చుట్ట పొగ గట్టిగాపీల్చి కాస్తంతసేపు గొంతులోనే పొగ ఉంచుకొని, వదలుతూ "చిదంబరం" అన్నాడు పొగ కండెనతో ఆలోచన యంత్రం కదిలి, తిరిగి, పొగతోపాటే యంత్రంలో పొట్టూడిపోయిన వడ్ల గింజ బియ్యంగింజ అయి బైటికి వచ్చినట్టు చిదంబరం పేరు వెలుపలికి వచ్చింది.

"అంతే!" "ఆడే!" "ఎంత పిదపకాలం!" "ఏందో మూడింది," "నాశనం, నాశనం అయిపోతారు!" వీథిలో ప్రహరీ అరుగుకి ఎదురుగా ఉన్న రైతులు ఏమేమో అనుకొంటున్నారు. నాగరికత ఏర్పడక పూర్వం, సంఘం సరిగ్గా రూపురేఖలు దిద్దుకోక పూర్వం, దేనికీ వ్యవస్థ సక్రమంగా నిర్ణయంకాని సమయంలో, ఏదీ నిర్ణీతంగాలేని దశలో, క్రమంగా, ఋజువుగా నీతికి కట్టుబడి ఉండాలని కోరే మానవ సమాజంలో వేదం ప్రతి విషయానికి ఆధారం అయినట్టు, వేదగత విషయం అధికారికమయినట్టు, ఇంత నాగరికత, సభ్యత, సంస్కృతి, మానసిక స్వాతంత్ర్యం ఉన్నాయనుకొంటున్న ఈ రోజుల్లో, ఆ గ్రామంలో మునసబు మాట చెలామణీ అవుతూంది. ఒక్కమాటలో ఆ ఊరిలో మునసబు మాట వేదవాక్కు!

ఆ ఊళ్ళో రమారమి నాలుగు వందల గడపలో వందగడప హరిజనుల పల్లెలో ఉంది. ఎండాకాలంలో ఆ పల్లెలో నీటిఎద్దడి. పాపిష్టి గుటక తిగటానికి గటక ఉండదన్న జనవాదం నిజమయితే, హరిజనులేంపాపం చేసుకొన్నారో, తంచనుగా వేసవిలో పల్లెలో ఉన్న ఒకేఒక్క బావి వట్టిపోతుంది. రాత్రంతా ఊరిన నీరు, తెల్లవారుజామున నాలుగు కావిళ్ళు మోసే బావిలో నీటిచెమ్మ లేకుండాపోతుంది రాత్రి బెత్తెడెత్తు నీరున్న బావి పగలు చెమ్మలేకుండా అయిపోతుంది.

ఊళ్లో ఉన్న అయిదు బావుల్లోను మూడు ఎడంకాలం ముట్టెత్తుకొంటాయి. రెండు బావుల్లో శ్మశానం ప్రక్క తోవలోనే ఉన్నబావి ఏళెల్లకాలం జలసమృద్ధితో ఉంటుంది పిడికెడు జల! ఎప్పుడో తప్ప ఆ బావినీళ్ళు

తెచ్చుకోదు ఊరు. ఊరికి విసిరేసినట్లుంటుందా బావి! ఆ రోజు ఊరంతా ఆ బావినీళ్లే తెచ్చుకొన్నారు. ఊరు పూర్వం ఈ బావికి దగ్గరగా ఉండేది. జనం పెరగటంతో ఇళ్ళు పెరగటం ప్రారంభమయి, శ్మశానంవైపు కాక, దక్షిణంగా పెరిగాయి.

ఎద్దు దట్టెం వేలాడుతున్న ఈ బావి పూర్వం పల్లెకు దగ్గరగా ఉండేది. ఊరు పెరిగిన తరవాత ఊరుకూ పల్లెకూ దగ్గరయింది. పల్లె పెరుగుదల ఆ బావికి దక్షిణంగా జరగటంతో దక్షిణంవైపు బావి అగత్యం ఏర్పడింది. ఆ బావి ఎండకాలం వట్టిపోతుంది. ఊరికీ పల్లెకూ మధ్యగా ఉన్న ఈ బావినే అందరూ ఊరబావి అంటారు. పల్లెకూ ఊరికీ మధ్యనున్న కంకరరోడ్డు మలుపు తిరిగేచోట ఉంది ఊరబావి. ఆ బావిలో ఏడాది పొడుగునా నీటికి ఎద్దడి ఉండదు.

రైలు స్టేషనులో దిగి, కోసున్నర దూరంలో ఉన్న చరిత్ర ప్రసిద్ధ దేవాలయ దర్శనార్థం కాలినడకన వెళ్లే యాత్రికుల సౌకర్యంకోసం ప్రభుత్వం తవ్వించిన బావి అది. మొదటినుంచీ ఊరు ఆ బావిని వాడుకొంటూ ఉంది. బావి చాలా పెద్దది. ఎనిమిది గిలకల బావి. రెండు నిలువుల నీరు ఏ క్షణమూ తగ్గిపోదు. పాత కట్టడమే అయినా గట్టి కట్టడం. క్వారీ రాయితో కట్టిన బావి! ఏభై మంది ఏ కష్టం లేంకుడా పడుకోటానికి అనువుగా చుట్టూ సిమెంటు చప్టా ఉంది. సిమ్మెంటు పెళ్ళలు లేచిపోయి, ఈ మధ్య గుంటలుపడి ఎర్రరాళ్ళు కనబడుతున్నాయి. బిందెలు, బానలు, కడవలు పెట్టడానికి అనువుగా అరిగిపోయి కుదుళ్ళు ఏర్పడ్డాయి. తాళ్ళు తగిలి, కడ్డవలు, బొక్కెనలు గీసుకుపోయి, సిమ్మెంటు రాలి, రాళ్ళు అరిగి, కోవులు పోయి, బావికి వార్ధక్యం వచ్చింది. బావిలోపల నీళ్ళపైన రాళ్ళ మధ్యనించి పుట్టుకువచ్చిన రావిమొక్కలు నాలుగైదు పైకి నిక్కిచూస్తూ ఉన్నాయి.

ఎండాకాలం ఎక్కువగా ఆ బావిలో నీళ్ళు ఊళ్లోవాళ్ళు తోడుకుపోతుంటారు. మిగతా సమయాల్లలో వాళ్ళకు ఊళ్ళో బావుల నీళ్లే ఉబ్బిడి మబ్బిడి.

ఊరబావి నీళ్ళు ఊళ్లోవాళ్ళు తోడుకుపోతున్న సమయంలో పల్లెల్లో వాళ్ళు వస్తే, యాచిస్తే ఇష్టం అయితే రైతు తను తోడి వంపుతేసుకొనో,

కావిళ్ళు వేసుకొని వచ్చిన మగవాళ్ళకూ, బానలూ, బిందెలూ తీసుకువచ్చిన ఆడవాళ్ళకూ పోస్తారు. పల్లెవాళ్ళు తీసుకుపోతారు. రైతుకు ఇష్టం లేకపోతే, శమ సహించలేకపోతే, కష్టం అయితే అప్పటికి పల్లెవాళ్ళకు నీళ్ళుండవు. ఊరబావిలో నీళ్ళు పల్లెవాళ్ళు తోడుకోరు. వీల్లేదు ఎవరయినా నీళ్ళు తోడిపోసిందాకా, పోసేమనిషి వచ్చిందాకా వాళ్ళు ఆగవలసి ఉంటుంది— ఎంతసేపు అయినా సరే! ఒక్కొక్కరోజు మధ్యాహ్నం వచ్చినవాళ్ళు సాయంకాలంగానీ నీళ్ళు తీసుకుపోలేరు.

ఆ ముందురోజు ఉదయం బానతో బావిదగ్గిరకు వచ్చింది స్త్రీ! పల్లెలో నించి వచ్చింది పొద్దు రెండు బారలెక్కింది. ఆమె పేరు ఎవరికీ తెలియదు. పల్లెలో తెలిసిందంతా ఆమె చిదంబరం భార్య అనే! ఊళ్ళోమాత్రం ఆమె రాముడి కోడలగా తెలుసు! పోయిన ఎండల్లో పెళ్ళయి ఆమె కాపరానికి వచ్చింది. ఆమె ఒడ్డూ పొడుగూ ఉన్న మనిషి. అలంకారాలు అంతగా లేవు. యౌవనం కలిగించిన సంపద శరీరం అంతటా ఉంది. భారీ విగ్రహం! ఒకసారి చూస్తే, ఎవరికయినా మళ్ళీ చూడాలనిపిస్తుంది. కనుముక్కు తీరు తీరుగా చెక్కిన బొమ్మను స్ఫురింపజేస్తాయి. అవయవాలు కుదిరికగా ఉన్నాయి. కళ్ళలో కళ ఉంది.

ఆమె బాన పట్టుకువచ్చి, బావి చప్టాకు ఎడంగా, కంకరరాళ్ళు గుచ్చుకోకుండా ఇసుక కుదురుచేసి బాన పెట్టింది. అప్పుడు నీళ్ళు తోడుకుంటున్నది ముసలాడూ, బాలుడూ కాదు. యువకుడు! అందుకే "రొండు కడవలిందులో దిమ్మరించు, దొరా!" అంది. "అట్టాగేనే!" అన్న యువకుడు బానతో రెండు కడవలు తోడిపోశాడు. నిండింది. తను తోడుకున్న కడవలు మట్టల్లో పెట్టుకుని, కావిడిబద్ద భుజంమీద పెట్టుకోబోతూ ఆగి, ఆమె ముఖంలోకి చూశాడు. అక్కడే నిలబడి ఉంది. ఆ విడిబద్ద కిందనుంచే దగ్గిరగా వచ్చి ఆమె ముఖంలోకి చూసి కిసుక్కున నవ్వి "ఏం వింకా నిలబడ్డా!" అంటే ఆమె "ఎందుకేం దట్టం నవ్వుతా?" అని "ఎవుకెత్తుతావేంది" ప్రశ్నించింది. "అంకెత్తూ లావుండా! వెత్తుకోలేవేంది!" అంటే "ఎవుళ్ళెవరున్నారే!" అన్నదే ఆమె సమాధానం! "నే నెత్తేదేంది, సెప్పు"

"నువ్వెత్తేదేంది దొరా నవ్వేందెతేది!"

"పొట్టు, ఎత్తుతా, పొట్టు వే.'' యువకుడు యిందుపంగాడు. ఆమె "సరే'' అని పైటచెంగు బిర్రుగా లాక్కొని తలమీద కుదురు చుట్టుకొని వంగింది. ఆమె కళ్ళు, ముక్కు, పెదవులు, మెడ, గుడ్లు మిటకరిస్తూ చూచి, కళ్ళు మూసి, మూస్తూ తెరుస్తూ నిలువెల్లా చూచి, బాన అంచు పట్టుకొని పైకెత్తేడు. ఆమె బాన అడుగున రెండు చేతులేసి తలమీదికి తెచ్చుకొంటూంది. బిర్రుగా బిగిసిన చీరే బలంగా బిగిసిన చేతులూ, శరీరం చూస్తూ బాన నెత్తిన పెట్టిపెట్టకయుండే, అతను హఠాత్తుగా చేతులు తీసి, దొంగలాగా అయిపోయాడు. "ఏంది? ఏందిది?'' అంటూ ఆమె వెనకి - జరిగింది బాన నెత్తిన నిలవలేదు ఆమె చేతులు గుండెలమీదికి వచ్చాయి. బాన ముందుకు, యువకుడి మీదికి పడింది. పగిలింది నీళ్ళు అతని ఒళ్లంతా పాకాయి. చేయి ఎత్తి చాచి యువకుడి చెంపమీద కొట్టింది. విసవిసా నడుచుకొంటూ పోయి మామతో చెప్పింది. ఆ పైన భర్తకు తెలిసింది. పల్లె ఒళ్లంతా మంట పుట్టింది.

"ఆడికెన్ని గుండెలూ అంట? అడగూతురు వంటిమీద చెయ్యేత్తాడా? ఆణ్ణెత్తురు కళ్ళజూత్తా!'' అని ఎవరో కోప్పడుతుంటే, చెప్పులు కడుగుతూ కూర్చున్న రాముడు పట్టెమంచం దగ్గరికి ఉన్మేసి "ఊరుకోండెసె: ఏందో కుర్రనాగమ్మ ఏడిసేడని ఎందుకట్టా యిదయేంది? యేంవొస్తది? గుద్దంట? ఆడి పాపం వాణ్ణే గొట్టుద్ది! ఐనా ఎందుకేందీ కవర్లాట! నోరు మూసుకోండెసె! అల్లరీ అదమూయింపులూ ఏందీ గోల? ఏ చెర్లో కప్పగా చెర్లోనే ఇవడాల గందా! ఎందుకంటా ఈ కచ్చలు! పోనిండెహే దేవు డెవుడెవుడికి కెంతెంత ఎెటాడో అంతే జరుగుద్ది! ఎవుల్లకర్మ కెవుళ్ళు కర్తలు? మజ్జలో మనంవేంది జేసేది? నోళ్ళు మూసుకొని మీ ఇళ్లకు మీరు పొండికిరే!" అన్నాడు. వచ్చినవాళ్ళు వెళ్ళిపోయారు. అప్పుడే తాటి గెల భుజంమీద వేసుకొని, బొడ్లో కత్తి దోపుకొని వచ్చిన చిదంబరం ఆ సంగతంతా విని బొడ్లో కత్తి దీసి గెల నడి బొడ్డులో నాలుగంగుళాలు దిగేట్టు నాటి, "నా తప్పు! పొమన్నే తాటి ముంజలకు తగలడ్డం నా బుత్తక్కువ! దీన్నాడికి బోసే సకుండుంటే సరి! వేకిలేదు'' అన్నాడు. "ఆ వూళ్ళోడితో తగాదా ఎట్టుకోవొద్దురోయ్'' అని తండ్రి హెచ్చరిస్తే, "నా కెందు కేంటి తగాదా దిగాదా? దీన్ని తాయికాడికి నీళ్ళకు బంపకుండుంటే సరి! అంతా సరవుద్ది!" అని జవాబు చెప్పాడు. అంతటితో తండ్రి ఊరుకోలేదు.

"మాటకు మాట తెగులు నీటి పాచి తెగులు అన్నట్లు, ఎందుకిట్టా జేసే వంటావంటాని అడిగేవు! దండగ! ఆడేదో అంటాడు వింటా నువ్వూరుకొంటావని నేనెట్టా అనుకుంటా, మర్నామాటిని నువ్వాఊసే మరిచిపో! ఏటంటా?" అంటే "అట్లాగేలే" అని చిదంబరం కావిడి వేసుకొని బావి దగ్గిరకి పోయి ఎవరో తోడపోస్తే ఆ రోజుకు సరిపడే నీళ్ళు తెచ్చాడు.

ముందు రోజు జరిగిన ఈ సంగతంతా మునసబు చెవిని పడక పోలేదు. బావిలో ఎద్దు దట్టైంవెస్తే ఊళ్ళోవాళ్ళు ఆ బావి తమకు వదలివేస్తారని దొంగతనంగా చిదంబరమే ఈ పని చేసిఉంటాడని గట్టి నమ్మకం కుదిరింది. ఎద్దు దట్టైండ్డా ఆ ఊరబావి ఊళ్ళోవాళ్ళు ఇంకా ఏ విధంగా తాగతారు? చుట్ట గట్టిగా పీల్చాడు మునసబు.

పొద్దణించి చిదంబరం ఎవరికీ కనబళ్ళేదన్నమాట! మునసబు తెలుసుకొన్నాడు. అనుమానం బలపడింది. 'యాడవయ్యాడీడు?" అందరికీ కళ్ళిగొన్నట్టే మునసబుకు ఈ ఆలోచన కలిగింది. వీథికి అవతల పక్క, మునసబు కూర్చున్న అరుక్కి ఎదురుగా, చేతికఱ్ఱ నేలమీద ఆనించి కుందు కూర్చున్న వెట్టిమనిషిని చూచి, "ఎట్టోణ్ణడిగితే సరిపోలా" అని ఎవరో రైతు ఇచ్చిన సలహా మునసబు వినలేదు. పొగ వెలుపలికి వచ్చేసరికి మెదడు మారుమూలల్లో ఆలోచన వెరుపై మెరిసింది చుట్ట కొస కొరికి, తుపుక్కున ఉమ్మి వేసి, పొగ పీల్చి తీవ్రంగా వదిలేవేసి, చుట్ట నేలమీద పడేసి, ఎదట వున్న అందరినీ చూచి విశాలంగా నవ్వాడు.

ఆ నవ్వుకు అర్థం వుంది. నిన్న నాంచారయ్య ఎద్దు చచ్చిపోయింది. అతను రాముడుకు రైతు. ఆ ఇంటిల్లపాదీ నాంచారయ్యకు పొలంపనులు చేస్తారు. రాముడే నాంచారయ్య ఇంటిల్లపాదికీ చెప్పులు కుట్టివ్వాలి. అందువల్ల ఆ చచ్చిన ఎద్దు రాముడికే అస్తి! ఊరబావిలో దట్టైం నాంచారయ్య ఎద్దుదే! ఆ పని చిదంబరందే! మునసబు నవ్వు పూర్తిగా మీసాలతో కలిసి నలువు తిరక్కముందే వెట్టి వాళ్ళతో రాముడు కొడుకును పట్టుకురమ్మని ఆజ్ఞాపించాడు

రెండేళ్ళకి పూర్వం వేణుగోపాల స్వామి దేవాలయం దగ్గిర ఉత్సవం

జరుగుతుంటే చెరువు గట్టుమీద కూర్చుని చూస్తూఉన్న చిదంబరం గుండెలో కోర్కె నృత్యం చేసింది. "సోఁవీ, దాంతో నాగ్గానీ పెళ్ళయిందంటే నీకు పాతికొబ్బరికాయలు గొడతా" నని మొక్కుకున్నాడు గానీ పూర్వాపరాలు ఆలోచించలేదు.

కోరుకున్న యువతితో పెళ్ళి జరిగాక, మొక్కుబడి తీర్చుకుందామంటే అన్నీ ప్రతిబంధకాలయ్యాయి.

పూజారి "నే ననేదేఁవుంది, ఎవుకొచ్చి కొబ్బరికాయలిత్తే వాళ్ళ పేరే గొడతా" అన్నాడు. ధర్మకర్త "దైవచింత గలిగితే ఇబ్బందులు చిక్కు దీసేదెట్టా ?" అన్నాడు

మునసబు నీ కోర్కెను కాదనేదేఁవుంది, నువ్వాపని జేత్తే సూత్తూ ఊరుకోటానికి ఊళ్ళోవాళ్ళ చేతులకి గాజుల్లేవు. ఆపైన నీ యిట్టం" అన్నాడు.

రాముడు "మంచిదేరా మరి. అదెట్టా యీలవుద్దో యేందో, ఆలోసించుకో, మజ్జలో నేనేంజెప్పేది, యేఁవన్నా జెయ్ ఫరవాలేదు, కత్తులూ కటార్లూ మాత్రం ఈ ఇసయం ముట్టుకోవద్దు. ఎటు దెబ్బబడ్డా కట్టఁవే. ఇగ నీ యిట్టం" అన్నాడు.

అందరూ అంత నేస్తరులు కారు. అందుకే నాంచారయ్యదగ్గిర నించి పల్లెలో నారయ్యదాకా అందరూ అదంత మంచిపని గాదన్నారు. ఇంట్లోనే ఆ మొక్కుబడి తీర్చుకొంటే పోదా అనిపించి, దేవుడి సొమ్ము దేవుడే చెల్లించాలని నిర్ణయించుకొన్నాడు అది భయంలోంచి పుట్టిన నిర్ణయం. అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో గుళ్ళో జొరబడి మొక్కుబడి తీర్చుకువస్తే సరిపోదా అనుకొని, అది పిరికివాళ్ళు, దైవభక్తి లేనివాళ్ళు చేసేపని అని భావించుకొని తనను తానే తిట్టుకొన్నాడు చిదంబరం

చివరకు పోలీసు అధికారి సాయంతో మొక్కు తీర్చుకొన్నాడు. అయితే అది ఊరి గుండెలో పుండు అయింది. చిదంబరం కనిపిస్తే కారం జల్లినట్లు ఉంటూ ఉండేది. ఆ గాయం ఇంకా మానలేదు సంవత్సరం అన్నా కాలేదు.

ఆ మధ్య ఊరి ప్రతినిధి మునసబు గుండెలో పుండు మానిపోతూ సెలవేసింది. అందుకూ కారణం చిదంబరమే! రంగస్థలం రైల్వేస్టేషన్ !

ఆ రోజు భార్యతో బస్తీకి బయలుదేరాడు చిదంబరం సినిమా చూచి రావాలని, టికెట్లు తీసుకొన్నాడు. సిగ్నల్ ఇచ్చి ఉంది రైలు అప్పుడే రాదనిపించింది. ఫెన్సింగ్ పక్క చిటికేసర చెట్టు కింద సిమ్మెంటు బెంచీ ఖాళీగా ఉంది భార్యతోపాటు కూర్చున్నాడు. ఊళ్ళోనించి వచ్చిన నలుగురు కూర్చునే చోటు ఖాళీలేకపోవడం చూచి చీమలు ఒంటిమీద పారాడినట్లు అయిపోయారు. వాళ్ళను చూడగానే సహజంగా లేచి నిలబడబోయాడు చిదంబరం. అసహజంగా అగిపోయాడు. లేవలేదు కారణం పక్క భార్య కావచ్చు. వాళ్ళు తన రైతులు కాకపోవడం కావచ్చు. ఇష్టం లేకపోవడం కావచ్చు. మూడు భావాల సమాహార రూపం పనిచేసి ఉండవచ్చు. త్రిగుణీకృతాంహంకారం కావచ్చు.

"యేరా, కళ్ళు గానపట్టంలా?" అంటే చిదంబరం తలఎత్తి వాళ్ళ కళ్ళల్లోకి చూచి, "కనిపిస్తున్నాయి" అన్నాడు. "వొళ్ళు పొగరెక్కిందా?" అంటే "లేదు" అని చెప్పిన చిదంబరం లేవలేదు. "ఉతకండ్రా నాలుగు వొళ్ళు పొగరు" అని ఒకతను చేయి ఎత్తాడు. దెబ్బ పడబోతుందని చిదంబరం తెలుసుకొనేలోగా ఆమె ఎత్తినచేయి పట్టుకొని "ఉంకవయ్యా, పెద్ద మణిసి! యేంది చెయ్యేత్తా? ఆఁ!" అంటూ అదమాయించింది అరుపులు వినిపించాయి. పోర్టర్లు, ప్రయాణీకులు పోగయ్యారు. స్టేషన్ మాస్టరు వచ్చాడు "యేం దయ్యోవ్, ఆడగూతురు మీద చెయ్ జేసుకుంటున్నావో" అని సర్దారు. "ప్రయాణీకులు ఎవరైనా ఇక్కడ కూర్చోవచ్చు. తప్పులేదు. ముందెవరు వస్తే వాళ్ళే కూర్చుంటారు వాళ్లను కూర్చోవద్దు అనే అధికారం మాకూ లేదు, మరొకరికీ లేదు. అంచేత ఇక్కడ తగాదా వద్దు" అన్నాడు స్టేషన్ మాస్టరు. అంతలో రైలు వచ్చింది. ఎవరంతట వాళ్ళే రైలెక్కారు. పైకి తగాదా ఆరిపోయింది లోన రగులుకోవటం మొదలైంది ఎడ్డుగడ్డి వామిలాగా. ఆ రోజు నుంచి పల్లెవాళ్ళు యథేష్టంగా ఆ బెంచీలమీద కూర్చుంటున్నారు. అందువల్ల మంట ఆరిపోలేదు.

దీనితో మునసబు గుండెలో పుండు మరీ పచ్చిగా అయిపోయింది.

బావి దగ్గర జరిగిన అత్యాచారంతో కాకి పొడిచిన ఎద్దు పుండులాగా గుండె తీపులు తీసుకొంటూ ఉంది.

చిదంబరం తీరు ఊళ్ళో వాళ్ళకు నచ్చలేదు పల్లెవాళ్ళు సంతోషంగా చెప్పుకోలేరు. సత్యనారాయణ లా డిగ్రీ పొందాడు. బస్తీలో అద్దెగదికి బోర్డు కట్టాడు ఎప్పుడో తప్ప ఏడాది పొడుగునా ఊళ్లోనే ఉంటాడు: చదువుకొనే రోజుల్లో సమ్మెల్లో పాల్గొన్నాడు. గాంధీజీ అన్నాడు జైలులో ఉన్నాడు కొంతలో కొంత విద్యార్థి నాయకుడుగా చెప్పుకోబడ్డాడు. హక్కులూ, సమానతా, స్వాతంత్ర్యం వంటి మాటలు అన్నాడు; అంటే విన్నాడు. ఆ రోజు "ఒరేయ్, తమ్ముడూ, చిదంబరం" అన్నాడు "ఏం దొరా" అనటం విన్నాడు

"దొరా గిరా అనొద్దురా! నువ్వు రెండు మంచి పనులు చేశావు. నాకు నచ్చాయి. నిన్ను మెచ్చుకొంటున్నాను. అభ్యుదయం కావాలి కావాలని కాకుల్లాగా అరిస్తే రాదు. తెచ్చుకొంటే వస్తుంది మేం స్వాతంత్ర్యం కావాలని అరిచాం. తెచ్చుకోకపోలేదు. తెచ్చుకొన్నాం. ప్రయత్నం,....ప్రయత్నం అవసరం. అంటరానితనం పోవాలని గొంతు చించుకొన్నా, కాగితాలు కరాబుచేసినా, బడ్జెట్ కేటాయింపులు జరిగి లక్షలు తగలేసినా గోడమీద పిల్లుల్లాంటి బిల్లులు, శాసనాలు చేసినా, ప్రయోజనం లేదు. సమానత్వం ఇచ్చేది కాదు. తెచ్చుకొనేది. మీరు తెచ్చుకొనే ప్రయత్నం చేయకపోతే, మేం అందరితో సమానం అని నమ్మకపోతే, ఎక్కడున్నావే గొంగళీ అంటే వేసినచోటే అన్నట్లుగా అవుతుంది. తమ్ముడూ, నువ్వు జేసిన పనులు నేను ఆనందంగా అంగీకరిస్తున్నాను. 'ఊరు అనే మనిషి రెండు చేతులు వంటి మాలపల్లె, మాదిగ పల్లెలను తెగ గొట్టుకొని దూరంగా పారేసుకొని మేం ఏమీ చేయలేకపోతున్నాం, మేం ఏమీ చేసుకోలేకుండా ఉన్నాం' అని ఏడ్చి ఏం ప్రయోజనం? ఈ ఊరికే కాదు, ఈ దేశానికే ఈ చీడ పట్టింది. ఈ జాతి రక్తంలోనే ఇది ప్రవహిస్తూంది. ఎప్పుడీ చేతులు అతుక్కునేది? ఎప్పుడీ దేశం చేతులు ఉపయోగించుకొనేది? ఎప్పుడు మా దేశం అభ్యుదయం సాధించిందని గుండెమీద చేయివేసి చెప్పుకోగలిగేది?"

అంతా విని, ఆ రోజు భుజం మీద పొలుగూ, దాని మీద వేలాడదీసిన సారా సరిజేసుకొంటూ చిదంబరం ఇంటికి వెళ్ళిపోయాడు.

ఎద్దు ముసలిదయింది. కాలం తీరి చనిపోయింది. బ్రతికి ఉన్నంత కాలం బాగా పనిచేసింది. అప్పుడెంత ప్రాణప్రదం అయిందో, చనిపోయి అంత భయకారణం అయింది. ఎంత మక్కువ ఉంటే మాత్రం ఎంతకాలం దాన్ని సావిట్లో ఉంచుకోగలడా నాంచారయ్య.

రాముడూ, చిదంబరమూ బండి కట్టుకువచ్చి, ఎద్దును బండిమీద కెక్కించుకొని, దున్నల్ని పూని, తోలుకొని వచ్చారు. పల్లెకు పరమట ప్రక్క పోరంబోకులో ఎద్దును పడేసి, చిదంబరం బండికట్టుకొని ఇంటకి వెళ్ళిపోయాడు. ఎద్దు తోలు ఒలిచి సలపతీసి పారేసి ఎద్దు చర్మంతో ఇంటికి రాడు రాముడు. పోరంబోకులో వేపచెట్టుకింద ఎద్దు దబ్బెం మీదా ఆకాశం నిండా తిరునాళ్ళలో జనంలాగా కాకులూ, గద్దలూ, రాబందులూ.

ఆ సాయంకాలం తోలు నానవేసి, నజ్జు నజ్జు సలప వేసి, సున్నం, నలగొట్టిన కరక్కాయా, తంగేటి చెక్కా కలిసిన గెలగాబులో ఊరవేశాడు రాముడు

రాత్రి చీకటి పడ్డ దాకా వేపచెట్టుకింద ఎద్దు దబ్బెం కాకులూ, గద్దలూ, రాబందులూ పీక్కుతినగా మిగిలింది ఉంది రాత్రి ప్రక్క ఊరి నుంచి వచ్చిన వ్యక్తి దాన్ని చూచినట్టుగా చెప్పుకొంటున్నారు. అయితే తెల్లవారే సరికి అది ఊరబావిలో ఉంది. చిదంబరం దుడుకు పిండం! ఇది వాడిపనే! లేకపోతే పల్లెలో వాళ్ళు ఎవరైనా చేసి ఉండాలది

ఊరబావికి పదిహేను బారల దూరంలో రాముడి ఇల్లుంది. ఇంటి చుట్టూ ముళ్ళకంచే, చిల్లి కంపలోంచి పెరిగి పిడికెడంత మొదళ్ళేసిన వేప చెట్టు అలవగా ఉన్నాయి. లోపల పది సెంట్లు నేల. రెండు నిటాళ్ళ ఇల్లు. అది క్వారిరాల్లకిట్టడం. మట్టిగోడలు. పైన సిమ్మెంటుపూత లేదు. కప్పు గట్టిది కాదు. తాటాకు కప్పు. ఇంటి వెనుక ఎడంభాగంలో పెంటపోగు, కుడిపక్క గడ్డివామి. ఇంటిముందు ఎడంవేపు గోడలేని పశువుల కొట్టం అందులో రెండు బండి దున్నలు, పాడిగేదె, కూడ ఉన్నాయి. ఇంటి ముందు ఆరు

తాటి గుంజల మీద పలచగా పరచి తాటాకుల పందిరి. పడమటి కాంబ రానికీ తాటాకు లేచి తొర్రగా ఉంది.

పందిరి మధ్య రాముడు కూర్చున్నాడు. కుడిపక్క పనిసంచి తోలుతి ఉంది. ఎడంపక్క ఎరవు దిగిన నీళ్ళ ముకళ్లో ఉన్నాయి. వెనక కాళీ గుంజ కానించి, నిండా నీటితో తోజేటి కొయ్య ఉంది. ముందు పనిరాయి, పక్కనే గూటం, ఆరె, పనికత్తి. రాముడు చిటికెన వేలుమీద సరవతున్న వారు. అంతకుముందు ఎవరో ఇచ్చిపోయిన పాత చెప్పుల జత, ఉంగటం తెగితే, నీళ్ళలో వేసి ఉంచాడు. దానికి ముందు అటకమీద చెప్పుతోలు వడతీసి అట్టలు కోసుకొని, మళ్ళీ పైన పెట్టి ఉంచాడు.

రావన్నా, సెప్పులు గాలా ?''

''కాకేందిరా పిల్లసన్నాసి, నిన్నే జేసేత్తనీగా!'' అని చెప్పాడు పక్కింటి మనిషితో రాముడు. ఆ పక్కింటి మనిషి పక్క ఊరిలో జరుగుతున్న పెళ్ళికి పేరంటానికి సిద్ధమయి వచ్చాడు. పెళ్ళి కొడుక్కి కిర్రుచెప్పులు కట్టించాడు. అందుకు రాముడు పెట్టింది పేరు.

''బాగుందయ్. మెకంలే, తీసుకుపో.' రాముడు చెప్పిచ్చాడు.

“తరవాత, డమ్ముల్లో ఇస్తా.''

''అట్టాగే లేసె'' చెప్పులు తీసుకొనికూడా వెళ్ళకుండా ఉంచే రాముడే అడిగాడు: “రాత్రికి వొత్తావా?' అతను ఏమీ చెప్పలేదు. వళ్లీ అన్నాడు: “లేబోతే పొన్నం తిని గుర్రుకొట్టి నిద్రబోయిలా లేసొత్తావా?” — “చెట్టు? రాత్రికి రావల్సిందే! ఇంటికాడ అది పిల్లనాయళ్లతో సావలేకుండా ఉంది. ఎల్లల్లా సంగతేంటి? — అదిసరేగాని, రామన్నా, వనోడు చిదంబరం సేసేడంటన్నారె అదంతా!'' ఇప్పుడు సమాధానం చెప్పటం రాముడు వంతు అయింది. “ఛా! ఛా! ఆడట్టటోడు గాడురా! సేత్తే సెప్పి మరీ సేత్తాడు. దొంగెవ్వారం వాడికంటా పంటాలేదు. అట్టా కొడుకు రా! యాంటనుకొంటున్నావో యాంవో!''

“యెందో, అందరూ ఆడే జేసేడంటా అని అంటన్నారు.''

ఆళ్ల నోళ్లలో పురుగులు బడతా యెపుడన్నారరే!"

"బాగయింది, రామన్నా! పీక ఇరగడయిపోద్ది ఆళ్ళాబాయి మన కొదిలేత్తే! యెట్టా జరుగుద్దో యేంవో సూద్దాం!"

'యేందో' అనుకొంటూ ఆ మనిషి వెళ్ళిపోయాడు. రాముడు మళ్లీ పనిలో తలదూర్చాడు. చెప్పు ఉంగటం దగ్గర నానింది. చెప్పు పనిరాయి మీద పెట్టి గూటంతో గట్టించి తోలులోంచి ఉంగటం కోసుకొని, ఆరెతో బెజ్జం పైకెత్తి ఉంగటం తోలు దూర్చి, కుట్టువారు సవరు జేసుకొని ఆరెతో బెజ్జం వేసి కన్నంలోంచి వారు లాగుతూ కుట్టటం ముగించాడు.

బావి దగ్గిర జనం ఉన్నారు. తొంగిచూస్తున్నారు. అక్కణ్ణుంచే అరిచాడు రైతు. "రాంవుడూ! యారోయ్, రాంవుడూ! అయ్యిందా?"

అయిందని చెప్పాడు. రైతు వచ్చి పాత చెప్పుల జత చేతికి తీసుకొని ఉంగటాలు చూచుకొని నేలమీద వేసి కాళ్లకు వేసుకొని "వొత్తాన్రా" అంటూ వెళ్ళిపోయాడు.

యేంవొత్తాడోయేంవో? రాముడు సణుక్కున్నాడు. కల్లాల్లో ఏమయినా ఇస్తాడనుకోవటానికి ఆ రైతు తన రైతు కాడు. ఊరబావి చూడటానికి వచ్చాడు వచ్చేటప్పుడు ఉంగటం తెగింది. రాముడికిచ్చాడు. రాముడు కుట్టి యిచ్చాడు. తీసుకు వెళ్ళిపోయాడు. ఏమయినా ఇద్దామనే తలంపే లేదు. ఒక మనిషి తనకు ఊరికినే పనిచేయటం కోసం తన కాళ్ళు కాపాడటం కోసం, దేవుడే సృష్టించి ఇక్కడ పారేశాడని నమ్ముతాడు. అతనొక్కడే కాదు రైతులంతా అంతే!

ఈ మనిషి చేసిన పనికి, పల్లె జీవితంతో డబ్బు ప్రసక్తి లేని రోజుల్లో, ఆ మనిషి పంటల కాలంలో పండిన దాంట్లోంచి అంతో యింతో ఇచ్చేవాడు అలాగే ఏటి పొడుగునా సరిపడే వస్తువులు లభ్యమయేవి.

కాలం పోయింది. ఇప్పుడంతా మారిపోయింది రైతుల బ్రతుకే కరువైన రోజుల్లో అంతంతమాత్రం అయిపోయింది. పెద్ద రైతుల ఇప్పటికి పంటల కాలంలో కొద్దో గొప్పో యిస్తారు. చిన్న రైతులు ఇవ్వలేరు.

అయితే ఆ రైతులు పొందే హోదా ఈ రైతులూ కావాలనుకొంటారు గానీ మరేమీ ఆలోచించరు.

కొత్తగా కోసిన అట్టలు బాగా నానాయి పనిరాయి మీద గూటంతో గటిస్తున్నాడు. పండి రాలిన వేపపళ్ళు తింటానికి వచ్చిన గండుచీమ బాగా తిని, ఒళ్ళు కొవ్వెక్కి ఉండవలసినచోట ఉండక పందిరిలోకి వచ్చి, అంతటితో ఆగక, రాముడి కాలిమీదికెక్కి, దిగిపోక, తొడమీద కుట్టింది. కట్టు పంచె విదిలించినా పోలేదు. పట్టుకు లాగితే మొండెం తెగివచ్చింది. తలకాయ పంచెలో ఇరుక్కుపోయింది.

తొడ చురచుర మంటుంటే పంచె తొలిగించి చూచుకొన్నాడు. చీమ కుట్టినంత భాగం నెత్తురు కమ్మింది. ఎర్రగా అయింది. చేత్తో గట్టిగా రుద్దుకున్నాడు. ఎర్రటి మచ్చ అయింది. ఇంకా మంట. గూటం తిప్పి రుద్దుకొని, కొంచెం తగ్గిన తరువాత కొత్త అట్టలు పనిరాయిమీద పెట్టి గూటంతో గట్టించబోతూ ఆగిపోయాడు. దెబ్బ వేయలేకపోయాడు.

ఈ అట్టల తోలు ఏ ఎద్దుదో, ఏ దున్నదో ఏమో, ఈ చర్మంమీద ఎన్ని చెర్నాకోల దెబ్బలు పడ్డాయో, అసలు పళ్లేదో, చేయివేస్తే ఆగమేఘాల మీద పరుగెత్తిందో, అసలు నడవలేక నానా యాతనా పడిందో, చచ్చిపోయినా మనుష్యులకు ఉపయోగపడుతూ ఉంది పశువు! 'బ్రతికి ఉండీ, చచ్చీ, ఉపయోగపడని మనుష్యులకు శరీరంమీద ఎంత మమకారమో! ఎంత అనురాగమో!' రాముడు పనిచేయలేకపోయాడు. తాబేటికాయ ఎత్తిపట్టి గొంతులో ఇన్ని నీళ్ళు పోసుకొని తాగి, "అమ్మయ్" అని, "ఊఁ" అనటం విని, "ఆడింకా రాలా?" అని ప్రశ్నించాడు. రాలేదంటే 'యాఁడ దగలడ్డాడో యాఁవో' అనుకొన్నాడు

ఆమె కోడలు. చిదంబరం భార్య! రాముడు భార్య రెండేళ్ల క్రితం చనిపోయింది. సత్యనారాయణ అనకపోలేదు చిదంబరంతో "మీ అమ్మ కాలం తీరి చావలేదురా, వైద్యం సదుపాయం లేక చచ్చిపోయిందీ" అని. అది రాముడూ విన్నాడు. ఆ మాట నమ్మలేదు. వైద్యం ఉండి ఎంతమంది చావటం లేదూ? ఆమెకు రోజులు తీరిపోయాయి. పోయింది. అంతే! 'భూమ్మీద

నూకలుండాలేగాని చావటం అంత సులభమా? అసలు చావు వస్తుందా?'
ఏమేమో ఆలోచించాడు రాముడు.

చిదంబరం ఒక్కడే కొడుకు! భార్య చనిపోయిందగ్గిరనించి వేళ కింత తిండి లేకపోయింది. కొడుక్కి పెళ్లి చేశాడు. పోయినేటినుంచి ఆ బాధ తప్పింది. ఇంటిపట్టునే వేళ కింత తినగలుగుతున్నాడు. ఆడవాళ్ళు కొందరే మగవాళ్లకు గర్వకారణంగా మసలుకో గలుగుతారు. రాముడి కోడలు అటు పుట్టినింటికీ ఇటు మెట్టినింటికీ గర్వకారణం! ''నా కోడలు'' అని తృప్తిగా అనుకోగలడు రాముడు. ''నా భార్య'' అని రొమ్ము విరుచుకొంటూ తిరగ్గలడు చిదంబరం. ఆమె రాకతో ఆ ఇంటికి సిరిసంపదలు వచ్చాయి. ఉన్న అయిదెకరాలలో పోయినేడు పంటలు బాగా పండాయి. ఊరంతా సంతోషంతో ఉండటంవల్ల రైతులు కల్లాలలో ధారాళంగా ఇచ్చారు. భార్య మరణంతో ఇంట్లోనించి పోయిన పాడి గేదెను కోడలు రాకతో మళ్లీ కొనుక్కోగలిగారు. పనిసామాను పందిట్లోంచి తీయకుండా తలగుడ్డ తీసి తలకింద పెట్టుకొని అక్కడే మేను వాల్చాడు రాముడు, గతం ఆలోచన మాని బావివైపు చూస్తూ.

ఊరబావి దగ్గిరికి వచ్చిపోయే జనం తగ్గిపోయారు. అప్పుడొకళ్ళూ ఇప్పుడొకళ్ళూ వస్తూ పోతూ ఉన్నారు. బావిలో దెయ్యం ఆలోచన బాధగా ఉంది. ఎవర్నననటం? ఏమనటం? బావివైపు బాధగా చూశాడు. తరతరాల మానవుడి అస్వతంత్రతకూ, బానిసత్వానికీ చిహ్నంలాగా ఉంది బావి. శిథిల సంస్కృతి గుండెలో పేరుకొన్న కల్మషంలాగా కుళ్ళులాగా లోపల దెయ్యం!

అటు చూడలేకపోయినప్పుడు, బావి పక్కనుంచి మలుపు తిరిగి, ముందుకు వచ్చి, తన ఇంటికే వస్తున్న వెట్టివాళ్ళను చూచి పడుకొన్న రాముడు లేచి కూర్చున్నాడు ''రాంవాయ్, యారోయ్, రాంవాయ్'' అంటూ వెట్టిమనిషి పిల్చాడు. ''యేందయ్యో, వాయ్ య్ అంటన్నావ్, మాటలు తిన్నగా రావేంది?'' అన్నాడు రాముడు ఎగాదిగా చూస్తూ. ''అది గాదు, రాంవన్నా; మునసబుగారు బంపితే వొచ్చాం'' అన్నాడు. రెండో వెట్టి మనిషి. రాముడికి మునసబు పేరు వినేసరికి ఎందుకో భయం కలిగింది. అయినా అడిగాడు, ఎందు కేంటి?"

వెట్టి వాళ్ళు ఇద్దరూ కొంచెం కొంచెం చెప్పారు. రాముడు నిజంగా భయపడ్డాడు. ఏం చేయాలో తోచలేదు. తప్పకుండా చిదంబరాన్ని చితక గొడతారు. 'యాఁవవుద్దో యేందో!' సణుక్కొన్నాడు. "ఆడింటిపట్టు నేడుంటాడురా? లేడు" అని అటూ ఇటూ చూచి "ఒత్తాళ్ళే" అన్నాడు.

కాశీ గుంజలకు నడుం మోపి, చేతికర్ర గడ్డానికి ఆనించుకొని, కర్ర మీద ఆని, నిలబడ్డాడొక వెట్టి మనిషి. మరోమనిషి కర్ర మోకాళ్ల మధ్య పెట్టుకొని కుందు కూర్చున్నాడు. "యాపికి బోయాడేందీడు?"

"యాఁవో!" వాళ్ళిద్దరి కాళ్లవైపు చూశాడు. గట్టి చెప్పులు! అర గని చెప్పులు! ఇంకా ఏడాది అయినా మన్నే చెప్పులు!

అంతలో చిదంబరం వచ్చాడు. నడినెత్తి ఎండను వేసుకొని వచ్చాడు. కాళ్ళు ఎర్రదుమ్ము కొట్టుకొని ఎర్రబారాయి. కాళ్లకు చెప్పులయినా లేవు. చెప్పులు కుట్టటం చేతకానివాళ్లకు కాళ్లకు ఎప్పుడూ చెప్పులుంటాయికాని, చెప్పులు కుట్టే తన కొడుక్కు కాళ్లకు చెప్పులు లేవు! రాముడు గుండెలో నవ్వుకొన్నాడు.

చిదంబరం ఆరడుగుల ఎత్తు మనిషి విశాలమైన వక్షస్థలం! బలమైన చేతులూ, కాళ్ళూ! తండ్రిపోసిన పిరికి మందు తాగి మరింత బలంగా రూపొంది దిన శరీరం. ఎవరికీ ఏ కష్టమూ తన జీవితంలో ఇంతవరకూ కలిగించ లేదన్న ధైర్యంతో పటిష్టం అయిన దేహం! ముగ్గురు దొంగల్ని కలేసి పట్టు కొన్న సామర్థ్యం ప్రసాదించిన శక్తి! అన్యాయం ఎంత ఘోరమయిం దయినా ఎదుర్కొగల దీక్ష! రెండెడ్లు పూన్చితే బిర్రుగా లాగగల బండి ఒక్కడే అనాయాసంగా లాగగల బలం!

ఆమె అన్నివిధాలా భర్తకు తగిన శరీర సౌష్టవంలో, బలంలో ఎవరు ఎడమో, కుడో తేల్చి చెప్పటం వీలుకాని దాంపత్యం వాళ్ళది! వాళ్లిద్దరికీ తేడా ఉంది. చిదంబరం నెమ్మది తండ్రి దగ్గిర నించి పంచుకున్న వారసత్వపు హక్కు. ఆమె చురుకుదనం, ఆవేశం, పట్టుదల, పగ వంశ పారంపర్యంగా సంక్రమించిన గుణాలు, నలుగురు మగాళ్ళు కష్టపడిచేసే పని ఆమె అవలీలగా చేయగలదు.

తలగుడ్డ తీసి తండ్రికిచ్చి, చేతిలో కొడవలి కిందపడేసి, భుజంమీద నించి దించిన గెలలు గోడకానించి, ముక్కుమీద, కళ్ళక్రింద, బొణతల్లో చెవులపైన, తలవెంట్రుకలలోంచి జారే చెమట తుడుచుకొని, "ఏంది కత కానా పెద్దోళ్ళొచ్చారిటు?" అన్నాడు చిదంబరం.

విషయం అంతా విని, కత్తి తీసుకొని, దెబ్బకొకటి చొప్పున గెల లోంచి, కాయలు రాలగొట్టి, ముచ్చికలు తీసి కోసి తండ్రికీ. వెట్టివాళ్ళకూ, భార్యకూ ఇచ్చి మసిగుడ్డకు చేతులు తుడుచుకొని, "అయితే యేం జేద్దా వంటా?" అన్నాడు తండ్రితో చిదంబరం. "ఇంకొక్కాయ" అంది లోపలి నించి భార్య. "ఒత్తన్నా" అంటూ ఒక గెలా, కొడవలీ తీసుకొని లోపలికి పోయి "నువ్వు గోసుకుందిను" అన్నాడు. ఆ పైన వాళ్ళిద్దరూ ఏమేమో మాట్లాడుకొన్నారు. బైటికి వినిపించలేదు.

పందిట్లోకి వచ్చి కూర్చుంటే "రా, బోదాం" అన్న వెట్టివాళ్ళకు, "గరువంతా దిరిగి వొచ్చేనుగా, కాళ్ళు పీకుతున్నాయి. మాపిటేల వొత్తా మునసబు గారితో జెప్పండి" అన్నాడు. "అట్టా ఈల్లేదు" అంటే "మీ యిట్టవింకా" అని ఊరుకొన్నాడు.

"ఆడు రాలేనంటున్నాడు గందా, నేనొచ్చి జెబుతా బదండి" అని రాముడు సాగాడు. ఏమీ అనలేక వెట్టి వాళ్ళు అతని వెంట బయలు దేరారు.

అప్పటికి బావిదగ్గర ఎవరూ లేరు. సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చాడు. రోహిణి కార్తె! రోళ్ళు బద్దలయ్యే ఎండ! దానికితోడు పడమటి శాంబరం. గాలికి రేగిన ఎర్రదుమ్ము ఆకాశానికి భూమికి మధ్య వేలాడదీసిన కాషా యపు బట్టలాగా ఉంది. అంత గాలి తోలినా ఉక్కగా ఉంది. చెమట పడు తూంది. ఒళ్ళు చిరచిర లాడుతూంది.

ఊళ్లోవాళ్ళంతా ఆ రోజు శ్మశానం పక్కనుంచే నీళ్ళు తెచ్చుకొన్నారు. లేత కొబ్బరి బొండలో నీళ్ళులాగా తీయగా ఉన్నాయని చెప్పుకొంటున్నారు.

ఎవరూ లేని సమయం చూచి చిదంబరం, అతని భార్య ఊరబావి లోకి తొంగి చూశారు. ఎవరూ ఎవరితోనూ ఏమీ మాట్లాడుకోలేదు. దబ్బెం కాళ్ళు నాలుగూ నాలుగు మోకులకు కట్టబడి, గిలకపట్టీలు కలుసుకొనే

మూలలో బంధింపబడ్డాయి. ఆ ముడులు చూశాడు చిదంబరం. ఏనుగ ముళ్ళు! ఆ ముళ్ళువేసిన వ్యక్తి నేర్పుకు ఆశ్చర్యపోయాడు. ఎగుడుదిగుడు లేని కదిమట్టమైన ముళ్ళు! ఎవరైనా చూస్తారేమోనని వాళ్ళిద్దరూ ఇంట్లోకి వెళ్ళిపోయారు.

వెట్టివాళ్ళవెంట రాముణ్ణి చూచి "ఆడేడిరా, ఈణ్ణి తీసుకొచ్చారూ?" అన్నాడు మునసబు. "ఆడికొంట్లో ఎట్లాగో వుంది. దొరా, డీలాపడిపోయాడు, ఇంటికాడే ఉంశాడు. యేంది, దొరా, రమ్మన్నారంటా?" రాముడు అడిగాడు.

నాంచారయ్య మునసబు కూర్చున్న ఈజీచైర్ కు ఎదురుగా గోడకు వీపు ఆనించి కూర్చున్నాడు పక్కనే కుర్చీలో సత్యనారాయణ. లంకంత ఇల్లు! "ఈళ్ళ కుటుంబమే ఇట్టాటిది గాదు. మంచోళ్ళు" అని నాంచారయ్య అంటే, "ఈడు మంచోడే, మనకిదెలియందేవుంది? ఈడు కడుపు నాడు నెడబుట్టాడు. ఈణ్ణి కట్టేసి నాలు గంటిత్తే ఆడు లగెతుకొత్తాడు. ఇట్లాటోళ్ళకి సురుకు దగిలితేదప్ప మాటినను! దెబ్బే దేవేంద్రలోకం" అన్నాడు మునసబు.

"వీణ్ణి కొట్టి ప్రయోజనం లేదు. లా ఒప్పుకోదు. వీడిచేత నిజం చెప్పిస్తే బాగానే ఉంటుంది. అంతేగాని...." నసిగాడు సత్యనారాయణ. "హోరి, పిల్లసన్నాసి! దెబ్బే దేవుడురా ఈళ్లకి. శా! పిల్లకాక్కేం దెలుసు ఉండేలు దెబ్బ! నువ్విట్టా ఉండు. ఆడెట్టా జెబుతాడో విను" అన్నాడు మునసబు. లేచాడు "కట్టేంద్రాణ్ణి సావిడిగుంజకి.'

"నేనేం జేయలా, దొరా, అంటున్నా ఎవరూ వినలేదు వెట్టివాళ్ళు రాముణ్ణి సావిట్లోకి తీసుకుపోయారు. "నువ్వు జేయకపోతే నీ కొడుకు. ఆడు జేయకపోతే ఆడి అబ్బ! మీరిద్దరూ ఏపీ ఎరగని నంగనాచులయితే మీ పల్లెవోళ్ళు...." అరిచాడు మునసబు. రాముణ్ణి గుంజకు కట్టేశారు. చింతబరికె తీసుకొని మునసబు వచ్చాడు. "సెప్పు! ఎవుళ్ళీపని జేసింది?"

"నేను గాదు!" చింతబరికె నాగుబాములా కాటు వేసింది. "ఎవురు?"

2)

"నే నెరగను, ఆడెరగడు"

"మరెవుళ్ళు!" చింతబరికె శివావతారమై విలయ నృత్యం చేసింది. రాముడి వంటిమీద వాతలు తేలాయి. ముఖంమీద దద్దురు లేచింది. గడ్డం మీద చిట్లి రక్తం వస్తూంది కనుబొమత వాచింది. "నీ కొడుకు నేసుంటాడు." — "ఆ డెరగడు. దేవుడు శోడు. నాకు దెలుసు. ఆడట్టాటి పజ్జేయడు దొంగపనాడొల్ల గాదు సెత్తే నేరీదుగా సేత్తాడు. నా మాటినుదొరా." "యేందిరా యినేది." కొట్టాడు. కొట్టి కొట్టి చేయి నొప్పి పుట్టింది. రాముడి కళ్ళలో నీళ్ళింకిపోయాయి.

సత్యనారాయణ కళ్ళు చెమ్మగిల్లాయి. నాంచారయ్య ప్రాణం చివుక్కుమంది. ఎంత లేదన్నా రాముడిది నాంచారయ్య వయస్సు. అంత పెద్దవాణ్ణి గొడ్డును బాదినట్టు బాదుతుంటే సహించక పోయాడు. సహించలేక చేసేదీ లేదు. "మునసోబుగారు! మీరిట్టా రండి!" అని చేయి పట్టుకొని వరండాలోకి తీసుకుపోయి ఈజీచైర్‌లో కూర్చోబెట్టాడు. మునసబు రొప్పుతున్నాడు. "దెబ్బలేసిన మీరే ఇంతగా ఇదయిపోతన్నారే, తినోడు — ముసలి ప్రాణం ఎంత ఇదయిపోవాలి? ఆ'' నాంచారయ్య సర్దాడు

నాంచారయ్యను చూచి "నువ్వూరుకో" అని మునసబు అంటే నాంచారయ్య నొచ్చుకున్నాడు. ఎంతలేదన్నా మునసబు నాంచారయ్యకంటే చిన్నవాడు. చిన్నాపెద్దా లేకుండా మాట్లాడటం బాధ కలిగించింది.

ఇంటిదగ్గిర చిదంబరం తండ్రి ఊళ్ళోకి వెళ్ళిందగ్గిరనించి ముళ్ళమీద కూర్చునట్లుగా ఉన్నాడు. పొద్దె వాలుతున్నప్పుడు ఊళ్ళో జీతగాడు, పల్లె కుర్రవాడు పరిగెత్తుకు వచ్చి "అన్నా, అన్నా! అయ్య వొళ్ళు వోతల్లేటట్టు గొట్టేడు మునుసోబు. కొట్టేసేరు" అని చెప్పాడు. ఇక కూర్చోలేకపోయాడు. చిదంబరం పైపంచె భుజాన వేసుకొని కర్రచేత పుచ్చుకొని బైలుదేరాడు. భార్య బ్రతిమాలింది. "నువ్వెళ్ళొద్దేం" "నువ్వుండె సెసీ." భర్త విదిలించాడు. హెచ్చరించింది "నిన్ను జంపేత్తారే." "చీ! పో!" చిదంబరం వినలేదు. ఊళ్ళోకి బయలుదేరాడు. నడవలేదు. పరుగెత్తలేదు. పరుగెత్తినట్టు నడిచాడు.

చిదంబరం మునసబు ఇంటిముందుకు వచ్చేసరికి మునుపటి ముగ్గురే

ఉన్నారు వరండాలో. వీధినిండా జనమే! చిదంబరం కనిపించగానే లేచి నిలబడ్డాడు మునసబు "దొరా!"

"యేంరా!"

"ఎందుకు మా అయ్యని గట్టేసింది?"

"కారణం చెప్పాలా నీకు?"

"ఆఁ!"

"ఎమికలిరగదన్నేవోళ్ళేక పన్జాయిసీ అడుగుతావంటరా?"

"మాటలు ఎక్కువ వొద్దు దొరా!"

"రేయ్, పట్టుకోండిరా యీణ్ణి.'

వెట్టివాళ్ళు పట్టుకోబోయారు. ఇద్దరినీ విదిలించికొట్టాడు.

"మా అయ్యనొదిలి పెట్టండి, నే బోతా, ఎందుకన్నా మంచిది."

చిదంబరం వెనుదిరిగాడు. మునసబు దుడ్డుగఱ్ఱ దీసుకొని ముచ్చికల గుంట మీద వెనకనుంచి చాచికొట్టాడు. అయితే స్పృహతప్పిపడిపోయాడు. వెట్టి వాళ్ళు అతన్ని ఈడ్చుకొనిపోయి సావిట్లో గుంజకు కట్టేసి ముఖంమీద నీళ్ళు చల్లి పరిచర్య చేశారు. రాముడు బాధతో విలవిలలాడిపోతున్నాడు. కొడుకుని చూడలేకపోతున్నాడు ఇద్దరికీ ఆవు కట్టుగొయ్య దూరం. చిదంబరం కళ్ళు విప్పాడు. తండ్రిని చూశాడు.

"అయ్యా!" పిలిచాడు.

"అయ్యా!" పలికాడు.

"అయ్యా, నువ్వూఁ అను ఈణ్ణి సంపేత్తా!"

"అత్తప్పురా! వొద్దురా!"

"అయ్యా!"

"నా మాటినర, వొద్దురా,"

మునసబు వచ్చాడు "నన్ను సంపేత్తావంటరా - యేదీ సంపు నూద్దాఁవ్." చాచి కఱ్ఱతో నడుంమీద కొట్టాడు. ప్రాణరక్షణ కోసం చిదంబరం వెంటబెట్టుకొన్న కఱ్ఱ! స్పృహతప్పిన చోట పడిపోయిన కఱ్ఱ!

"అయ్యా!"

"ఒద్దురా!"

చిదంబరం కోపం పట్టలేక ఊగిపోతున్నాడు. కాళీ గుంజ ఊగింది. సావిడి సంచలించింది. క్షణకాలం మునసబు గుండె ఆగిపోయింది

తీరికగా మునసబు అడిగాడు: "యెవుర్రా ఈ పన్జేసింది?"

చిదంబరం మాట్లాడలేదు.

"సెప్పు!" సమాధానం లేదు. మాటమాటకొక దెబ్బవేస్తున్నాడు. "దేవుడుగావాలా నీకు!" దెబ్బ! దేవాలయంలో కొట్టిన కొబ్బరికాయ పగిలినట్లు తల పగిలింది నీరు రాలేదు. నెత్తురు వచ్చింది. మునసబు చేయి వణికింది. చిదంబరం స్పృహతప్పి పడిపోయాడు. రక్తం కారిపోతూఉంది. ఏనుగు బలం! ఎలక గుండె!

వెట్టివాళ్ళు మాసిన గుడ్డ పేలికలు తెచ్చి కాల్చి, మసిచేసి, తలమీద మసి, రక్తం కారుతున్నచోట అద్దారు. రక్తం ఆగిపోయింది. స్పృహరాలేదు. తను అన్ని దెబ్బలుతిని కంట తడిపెట్టని రాముడు, తను అస్తారు బస్తంగా పెంచుకొన్న కొడుకును, ఇంతవరకు ఎప్పుడూ దెబ్బతిని ఎరుగని కొడుకును హృదయంలో హృదయంగా పెరిగిన కొడుకును, అన్యాయంగా తన కళ్లెదుటే కొడుతుంటే, ఏమీ చేయలేని స్థితిలో చూస్తూ ఉన్న రాముడు ఆవురుమని ఏడ్చాడు. ఆ ఎడుపు ఎక్కడో స్నాయువుల్ని మీటితే చిదంబరం కదిలాడు. స్పృహ వచ్చింది.

మునసబు వరండాలోకి రాగానే పిచ్చెక్కిన మనిషి ఊగిపోతున్నట్లు అయి, "వాడేగనక ఛస్తే, నీకు నేను ఉరిశిక్ష వేయించకపోతే, నా పేరు సత్యనారాయణగాదు" అన్నాడు సత్యనారాయణ

"యేడిసేవులే!"

"అదీ జరుగుతుంది." దూకుడుగా వెళ్ళిపోయాడు.

"యేందిది? మణుసులు జేసే పనేనా యిదంట? పశువులు! పశువులు జేత్తాయిట్ట! నువ్వు...నువ్వూ మణిసివిగాదు, పశువ్వి. ఛీ!" అన్నాడు నాంచారయ్య.

"నాంచారయ్యా!" గర్జించాడు మునసబు.

"నువ్వుండవయ్యా మళ్లీ మణిసెల్లే మాట్టాడొత్తన్నా!" నాంచారయ్య వెళ్లిపోయాడు.

వాళ్లిద్దరూ కనుచూపు కందకుండా పోయిందాకా చూచి, వణుకుతున్న చేతుల్ని అదుపులోకి తెచ్చుకోజూశాడు. మరీ కుడిచేయి సంచలించిపోతూ ఉంది. మూలనున్న దొడ్డుకర్ర భగవంతుడి చేయిలాగా ఉంది. అదిలేకపోతే దుర్మార్గుడు తప్పించుకొని పోయేవాడు. వరండాలో అది నవ్వుతున్నట్లుంది. మునసబు ఇదో మాదిరిగా కూర్చున్నాడు. మంచివాళ్ళు, కొంచెం స్నేహితులు ఇద్దరు కోపగించుకొని వెళ్ళిపోయారు. అయితే కొందరు విరోధులు ఇంతకాలానికి నువ్వుచేసిన మంచిపని ఇదొక్కటే అని మెచ్చుకున్నారు. "అధర్మం అరికట్టాలనే నీ లక్ష్యశుద్ధి నేను శంకించనుగానీ మార్గం సక్రమమయిందని మాత్రం నేను విశ్వసించలేను" అని కరణం చెప్పాడు. ఆలోచించినకొద్దీ మెదడంతా పురుగు తొలుస్తున్న పేడలాగా అయిపోతూంది. ఎందుకో అకారణంగా భయం కలుగుతూంది ఎక్కడ్ణించో సన్నటి శబ్దం వినబడుతూంది. ఎక్కడో గుండె మారుమూలల్లో నిప్పురవ్వ రాసుకొంటూ ఉంది. ఏదో దైన్యం నిట్టనిలువునా వ్యాపించింది. ఇటువంటి భావాలు పుట్టే స్వభావం కాదు మునసబుది. తనేదో చేయరాని దుష్కార్యం చేసినట్లు, దానికి సంబంధించినశంక, అవ్యక్తరూపంలో భయంగా, దిగులుగా కనిపించని నీడగా ఒళ్లంతా ఆక్రమించుకొంది. ఇటువంటి అనుభవం, అంత త్వరగా అందరికీ కలగదు. లెక్కలేనన్ని హత్యలుచేసి, చెక్కుచెదరని కోటగోడలా నిలబడగలిగే మనుష్యులు ఎందరో ఉంటారు. వాళ్లందరికీ ఇటువంటి అనుభవం కలిగితే, ఆ పైన ఏమీ చేయలేరు. ఇటువంటి అనుభూతికి ఆస్కారం ఇచ్చిన హృదయం కొంతవరకు కోమలమయిందే అయి ఉంటుంది వయస్సు అధికారం, అభిజాత్యం, అందం ఉన్న మనిషి ఎంత త్వరగా, అవకీ లేకపోతే పాడయిపోగలడో, చెప్పాలంటే మునసబు నిదర్శనం.

పల్లెలో పాడుబడ్డ బావిప్రక్క తాతల్నాటి మర్రిచెట్టు క్రింద పెద్దలయిదుగురు కూర్చున్నారు జీతగాళ్ళు, చదువుకొంటున్న కుర్రకారు, వ్యవసాయపు కూలీలు అందరూ చేరారు. బావిలో ఎద్దుదంట్టెం ఎవరు వేలాడదీసి ఉంటారనేది ఆలోచించారు. తెలియలేదు. వాళ్లిద్దరూ చేసి ఉంటారా? చేయరు. అయితే అన్యాయంగా మునసబు వాళ్లను శిక్షించాడు.

దానికేం చేయాలి? ఏం చేసినా నిలవ నీడలేకుండా అయిపోవడం తప్ప గత్యంతరం లేదు. నిదానంగా ఆలోచించాలనుకున్నారు. కుర్రకారు దెబ్బకు దెబ్బ అన్న తీరులో మాట్లాడారు.

ఏం చేయాలా అని తీవ్రంగా వాళ్ళు ఆలోచించుకొంటున్నప్పుడు ఊళ్ళోవాళ్ళు ఊరబావిలోంచి పల్లెవాళ్ళతో ఆ ఎద్దుదట్టెం తీసేయించాలని తీర్మానించుకొని,ఒక రైతును పంపించారు. ఆసమయంలో ఆ రైతు పల్లె పెద్దల్ని అడగటం తగిందికాదు. వాళ్ళు చెప్పిన సమాధానం సహజమయిందే! ఆ బావి మేం ముట్టుకోకూడదు. అందువల్ల మే మా పని చేయము అన్నది జవాబు!

ఊరిపెద్దలకు కోపం వచ్చింది ఆ విషయం వినటంతో ఇంత కండకావరమా, పొగరా అని తిట్టారు. అసలు ఇది పల్లె అంతా కలిసి చేసిన పనే అనుకొన్నారు. జీతగాళ్ళనూ, వెట్టివాళ్లనూ, అలాగాజనాన్నీ వెంటబెట్టుకొని రైతులు వచ్చారు. ఊరబావి దగ్గర పోగయ్యారు. సూర్యుడు పడమట కుంగిపోతున్నాడు. నాలుగు మోకులూ విప్పి నాలుగు గిలకమీద వేసి, అందరూ కలసి లాగి, పైకి వచ్చినదంట్టెం అందుకొని వెలుపల తీసిపడెయ్యాలని పథకం. అలాగే చేశారు. ఎద్దుదట్టెం నీట్లో తడిసి బరువెక్కింది. పైకి లాగటం కష్టమే అయింది పైకి వచ్చింతరువాత ఎలా పక్కకు తప్పించటమో తెలియలేదు. ఒక జీతగాడు ఆ ప్రయత్నంలో అప్రయత్నంగా కాలు జారి బావిలో పడ్డాడు. అదిచూస్తూ ఉన్నవాళ్ళలో కొందరు భయంతో, సంభ్రమంతో మోకులు వదిలేశారు. మిగతావాళ్ళకు బరువు ఎక్కువయింది. నిలదొక్కుకోలేక వదిలేశారు. దట్టెం నీళ్ళలో పడింది మునిగిపోలేదు. కొంచెంగా తేలుతూ ఉంది. దానికింద పడ్డ జీతగాడు తలపైకెత్తిందాకా పైనున్నవాళ్ళ పై ప్రాణాలు పైనే పోతున్నాయి. దట్టెం పైకి తీయాలన్న ఆలోచనపోయి, జీతగాణ్ణి పైకి తీయాలన్న ప్రయత్నం ఎక్కువయింది. ఒడ్డుకు వచ్చిన జీతగాడు "ఆ దట్టెం బలికోరింది" అన్నాడు. అందరికీ భయం పట్టుకొంది. ఒక్కొక్కరే జారుకొన్నారు. పక్కపల్లె వాళ్ళను రేపు పిలిపించాలి అనుకొంటూరైతులు వెళ్ళిపోయారు. చోద్యంచూస్తున్న పల్లెవాళ్ళు ఇళ్ళల్లోకి వెళ్ళిపోయారు. బాగా చీకటిపడింది

చిదంబరం భార్య చాలా సేపటినించి కళ్ళువాచిపోయేట్లు ఏడుస్తూ

ఉంది ఇంతసేపు బావిదగ్గర సందడి ఏడ్పులోకి వినబడుతూ వచ్చింది. ఇప్పుడు విచిత్రంగా నిశ్శబ్దం ఆవరిస్తే బావివైపు చూసింది. బావి నిర్మానుష్యం అయిపోయింది ఆమె ఏడ్పు ఆగిపోయింది.

సావిట్లో కొడుక్కు స్పృహ వచ్చిన తరువాత రాముడు దిగులులోనే ఆనందం పొందాడు. బాధ అనే సారవంతమయిన భూమిలో ఆనందం అనే చిన్న మొక్క పుట్టుకువస్తే భూమికే అందం వచ్చినట్లు రాముడి దుఃఖం, దిగులు, బాధ అందగించాయి. చిదంబరం గుండె రాయి అయింది "యేం దయ్యా యిదీ?"

"ఏఁవుందిరా!"

రాముడు గుండె చెరువయింది ఎవరి వయస్సు ఓర్చుకోగలిగే దెబ్బలు వాళ్ళకు తగిలాయి. ఇద్దరి శరీరాలు రాత్రితోలే చల్లని గాలికి తీపులు తీసుకుంటున్నాయి. ఒంటిమీది దెబ్బలకంటె హృదయం పొందే చిత్రవధ ఇద్దరూ తట్టుకోలేక పోతున్నారు.

ఆకస్మికంగా "అదెట్టుందో" అనే ఆలోచన వచ్చింది. చిదంబరం వణికిపోయాడు. పట్టరాని కోపం వచ్చింది. ఊరికే ఊగిపోతున్నాడు. "మళ్లీ యాంవయిందిరా?"

"యాంలా."

పల్లెలో చిదంబరం భార్య ఆ రాత్రి అన్నం వండుకోలేదు. ఆలోచిస్తూ కూర్చుంది. ఇంట్లో దీపంకూడా ముట్టించలేదు. పక్కఇంటి ముసలమ్మ "ఇట్టుంటే ఎట్టాగే, పిల్లా? మేఁ నిట్టాటియ్ శానాజూసేంలే! రేపొద్దున్నే ఆళ్ళొత్తారింటికి" అంటూ వచ్చి దీపం వెలిగించి, పొద్దుటి అన్నం బలవంతంగా ఇంత తినిపించింది. "నువ్విడే పండుకో, అవ్వా!" అని నిశ్చయంగా అడిగితే, "అట్టాగే లేయే" అంటూఅవ్వ మంచం వాల్చుకొని పడుకొన్న మరుక్షణం గురకపెట్టింది.

దీపం వెలుగుతుంది. దుఃఖం ఆగటంలేదు. తలుపు వారగా చెప్పులు, మూలన కర్ర ఉన్నాయి. చూచింది రెండు మూడుసార్లు "అవ్వా! అవ్వా" అని పిలిచింది. ఆమె ఉలకలేదు. పలకలేదు. గుర్రుగుర్రు మంటూనిద్రపోతూ

ఉంది. ఆమె నడి మంచంమీద కాళ్ళు చాచి పట్టువేసుకొని కూర్చుంది నిద్ర పోయే ప్రయత్నంలో లేదు.

ఊళ్ళో మునసబు అకారణంగా వణికిపోతున్నాడు. ఆ భయంతోనే గురవయ్యను—బొద్దు మీసాలు. ఎర్రకళ్ళు, భయంకరంగా ముఖం, పగలు చూస్తే రాత్రి కలలోకి వస్తాడు. పసిపిల్లలు చూస్తే ఆవురుమని ఏడుస్తారు—తనతోపాటు ఉండమని కబురుచేస్తే వచ్చాడు ఇంట్లో ఎంతకీ గాలి రాకపోతే వరండాలోకి మంచం మార్పించుకొన్నాడు మునసబు. పక్కనే చాప వేసుకొని పడుకొన్నాడు నీరుకావి పంచె కట్టుకున్న గురవయ్య "ఆ దుడ్డుకర్ర ఆ మూలనించి దీసెయిరా!" అన్నాడు. మునసబు. "నేనుండగా మీకేంటి, పోఁవీ, భయం?"

గురవయ్య అభయం ఇచ్చాడు. "లైటేసుకుబడుకుందాంరా"

"శా! యేఁది, పోఁసీ మీకింతిది? నేనే నీకు? గుండెమీచ్చెయేసుకొని పొండుకో, పోనీ! లైటుంటే నిద్దర్రాదు నాకు!"

ఇద్దరూ పడుకొన్నారు. మరుక్షణంలో ఇద్దరూ నిద్రపోయారు. ఒకరు నిశ్చితంగా, మరొకరు కోపంవల్ల ఇద్దర్ని కొట్టటంవల్ల, శరీరం అలసిపోయి నిద్రబోతున్నారు.

రాముడింట్లో దీపం వెలుగుతూంది. ఎవరో తలుపు తట్టుతున్నారు. "యాఁవే! యావే!"

"యెవరు?" ఆమె లోపల్నించే అడిగింది. "నేనే!"

"నేనంటే యెవుణువ్వు?" అంతదాకా ఆమె నిద్రపోలేదు. అంతు తెగని ఆలోచనల మధ్య కొట్టుకులాడుతూ ఉంది. తలుపు తీసింది. యువకుడు! ఆలోచనలు రూపం దాల్చాయి. "నువ్వా!" "ఆఁ! యేందే, నేన్నీమీద సెయ్యేసేనా? ఎందుకట్టా గోలైశా? ఆఁ!"

యెందుకిటా వచ్చా? తలుపు కానించి ఉన్న చేతికర్ర తీసుకొని బాచి తల మీద కొట్టింది. "అమ్మో!" అన్నాడు యువకుడు. "నువ్వు రాచ్చసివే! రాచ్చసివే!" అన్నాడు. మళ్లీ కర్ర పైకెత్తింది. వెనక్కి తగ్గాడు. ముందుకు వచ్చింది. వెనుదిరిగాడు. వెంటబడింది. మొదట గబగబా, తరవాత పరుగు పరుగునా, మళ్లీ గబగబా, తరవాత నెమ్మదిగా తల తడుముకొంటూ యువకుడు ఊళ్లోకి వెళ్లిపోయాడు.

ఆమె తలుపు గడియవేసింది. అవ్వ నిద్రపోతూ ఉంది. ఆమె ఒళ్ళు ఒణికిపోతూ ఉంది. దీపం వెలుగుతూ ఉంది. మళ్ళీ మంచంమీద కూర్చుంది. ఆలోచనలు దరిజేరుకొంటున్నాయి.

మునసబు పడుకొన్న వరండాలో వెలుతురు లేదు. ఆకాశంలో వెన్నెల లేదు. లక్షల నక్షత్రాల వెలుతురు భూమిమీదికి రావటం లేదు.

సావిట్లో—చీకటిలో చిదంబరం చేతికట్లు ఎవరో విప్పుతున్నారు. "అయ్యా!" అన్నాడు చిదంబరం తండ్రి అనుకొని. "యాంరా" అన్నాడు రాముడు అల్లంత దూరంనించి. "యెవురు నువ్వు?" అడిగాడు చిదంబరం. రాముడు అడిగాడు: "యెవుర్రక్కడుందీ?"

"యెవురో?"

"యెవురో, యేంజేత్తన్నాడేంది?"

"కట్లిప్పుతున్నాడు"

"ఉష్, అరవవద్దు!" మూడో వ్యక్తి కంఠస్వరం!

మళ్ళీ నిశ్శబ్దం! రాముడికీ, చిదంబరానికీ కట్లు విడిపోయాయి. "పొండి! పారిపొండి!" హెచ్చరిక. "పోం, దొరా!" రాముడు.

వెళ్లండి ఈణ్ణించి వెళ్లిపొండి." వెళ్లం, దొరా!" రాముడు.

"వెళ్ళకపోతే తంతాను. వెళ్లండి." ఆ కంఠస్వరం గుర్తుబట్టారు. సావిడి వెనక ఏదో శబ్దమయింది. ఆ మనిషి ఈ శబ్దం విని గడ్డిచాటున నక్కాడు.

ఎవరో నడుస్తున్న అలికిడి స్పష్టంగా వినిపించింది. జీతగాడు పశువులకు గడ్డి వేయటానికి వస్తున్నాడేమోననుకొని, నెమ్మదిగా లేచి, ఆ మనిషి సావిడి చాటుగా వీథిలోకి వచ్చాడు. సావిడి వెనక మనిషి నడిచిన అలికిడి రెండు క్షణాలు స్పష్టంగా వినిపించింది. తరవాత వినబడలేదు. తండ్రీ కొడుకులు మాట్లాడుకొంటున్నారు. "సత్యనారాయణ దేవుఁడు లాంటాయనయ్యా!" "అవున్నా!"

"యెళ్లిపోదాం, పద!" "యాడికి?"

''ఇంటికి.'' ''యెల్లి?'

''యెళ్ళేఁవుంది యెళదాం.''

''ఓరేయ్, మునుసోబుగారు పంపకుండా మనం యెళితే, రేపు మళ్ళీ బట్టుకొచ్చి చితగొడితే దిక్కేఁవుందిరా మనకి! ఈ ఊరిడించి బారి పోలేంగా! రేపు నిజం తెలిసి ఆళ్ళే ఒదిలేత్తారు.''

అంతటితో ఆగిపోలేదు ఆళ్ళొదిలేసిందాకా యెందుకుండాలేం ఇక్కడ? యెల్లిపోదాం! రమ్మంటే రావొచ్చు. దవురుజెన్నెం జేత్తే కక్కురుచ్చుకోడం. తాడో పేడో తేలిపోద్ది''

''ఒరే బాబా, నువ్వు పిల్లోడివిరా. ఈళ్లని తుస్కారించి బతకటం కట్టంరా. ఆళ్ళొకచేత్తే నువ్వొకచేత్తావ్. ఆళ్ళు నలుగురొత్తె, నువ్ నలుగురేసుకపోతావ్. ఆళ్ళు ఊరంతా లెగబడొత్తే, పల్లెంతా కలిసి తిరగబడ్డా ఆళ్ళని జయిచ్చటం కదురుద్దా? తన్నుకోటాలూ, సావటాలూ తప్ప ఎందుకొచ్చిన పొట్లాటలురా యియ్య.''

''ఎన్నాళ్ళేం దీళ్ల దవురుజెన్నెం!''

''నువ్వు మణిసివి! ఆళ్ళు మనుసులు! మణిసీ మణిసీ మరియాదగా ఉంటే సరిపొద్దిగా! ఆళ్లట్టా మారాలంటే మనఁవే దవురుజెన్నెంచేత్తే యెట్టా ఈవుద్ది''

''యేందో నీ యేదు పెప్పుడూ యింతే!''

''నామాటినరా, బాబు! ఎవురో పున్నెం గట్టుకొని బాయినిట్టా చేసేరుగందా! ఇదీ మంచికే వొచ్చింది! మనఁపీద అనుఁవానం వుందంటావా, అదేరే సంగతి! ఉణ్ణీ! నట్టఁవేఁ వొచ్చింది? ఈ దెబ్బతో పల్లెవోళ్ల నీపెద్దది దగ్గిపోద్ది! ఇప్పుడు మనఁవ్ జారిపోతే అంతా గుల్లయిపోద్ది! నా మాటినిరా! నీ గుంజ దగ్గిర నువ్ గూసో! నే నీడ గూసుంటా! సరిపోలా?''

''తాళ్ళివ్వే కట్టేసుకోటానికే, యాడుండయ్యొ ఏందో!'' అయ్య మనల్ని కట్టేత్తాయా? నీతి! నీతిరా! నీతి కట్టేత్తది మనల్నీ!''

తండ్రీ కొడుకుల కట్లు విప్పబడినప్పుడు వినవచ్చిన అలికిడి, స్వాభిడి

వెనక ఎక్కడ ఆగిపోయిందో, అక్కడ మళ్లీ అలికిడి అయింది. అక్కంణ్ణించి, అగ్గిపుల్ల గీసిన శబ్దం! అగ్గిపుల్ల వెలుతురు. తాటాకుమంట. వెంటనే గుప్పున మంట! "మంట! మంట!" అప్పటికి పరుగెత్తిన అలికిడి! "బాను గా! యేంటిదీ?" రాముడు ఆలోచన! "దొంగలు! దొంగలు! పట్టుకోండి...." ఇక చిదంబరం అరవలేదు. రాముడు నోటిమీద చేయివేశాడు "అరవొద్దురా!" తండ్రి హెచ్చరించాడు. సావిడి వెనకనుంచి మంటలు నాల్కలు చాస్తున్నాయి. పూర్తిగా రగుల్కోలేదు. కొంచెం వెలుతురు! వాళ్లను కట్టిన తాళ్ళు కనిపించాయి. రాముడు తాడు అందుకొన్నాడు. కొడుకును కట్టేస్తున్నాడు. ఆ సావిట్లో అదే గుంజకు. మండుతున్న సావిడి "యేందిదీ?" చిదంబరానికి ఏమీ అర్థం కాలేదు. "అరవొద్దు!" రాముడు దూముడి వేశాడు. తాడు తీసుకొని తనను కట్టుకొన్నట్టు వేసుకొన్నాడు. సావిడి వెనక పెద్ద మంట లేచింది. "అయ్యా! మనంవిందులోనే కాలి సద్దాంవా యేంటి?"

"ఒద్దురా! ఒద్దనే ఒద్దు! దొరా! దొరా! సావిడి గాలిపోతుంది. దొరా! దొరా!" పెద్దగా అరిచాడు. చిదంబరం నోటి వెంట మాట లేదు కాలుతున్నవైపు చూస్తూ ఉండిపోయాడు.

చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు లేచారు. వీథిలో జనం పోగయ్యారు. ఎవరో గేదెల్నీ, ఆవుల్నీ, ఎద్దుల్నీ, దూడల్నీ పలుపులు విప్పేశారు. సత్యనారాయణ తండ్రీ కొడుకుల దగ్గిరికి వచ్చాడు. "మీరీడే దగలడ్డారా?" అన్నాడు. కొంచెం ఆలోచించి "మంచి పని చేశారు" అన్నాడు రాముడు తాడు తొలగించుకొన్నాడు కొడుకు తాడు దూముడి లాగేశాడు. "అరవవద్దు! ఏమీ మాట్లాడవద్దు! నోరు మూసుకొని ఉండండి! ఎవరేం అడిగినా ఏమీ తెలియదని చెప్పండి రండి" అంటూ వెలుపలికివచ్చి "వీళ్లని చంపేయటానికి సావిడికి నిప్పు పెట్టుకోవాలా? ఎక్కడుండా ఓ మునసబు! నే నిప్పకపోతే వీళ్ళు చావాలనేగా మునసబు ఎత్తుగడ!"

అందరూ కలిసి సావిడి ఆర్పారు. సగం కాలిపోయింది. తలమీద కట్టిన కట్టు సంగతి మర్చిపోయి, ఒళ్ళు నొప్పులు తెలియకుండా, మంటలార్పిన చిదంబరం వాతలు తేలిన శరీరం పెట్టే శ్రమ గుర్తించకుండా నీటి

కడవలు అందించిన రాముడు మంటలారిపోయాక ఒకర్నొకరు చూసుకొని కళ్ళు తుడుచుకొన్నారు. అక్కడ చేరిన వాళ్ళు తలకొక విధంగా వాళ్ళిద్దర్ని చూశారు. ఎక్కువ మంది జాలిపడ్డారు.

మునసబు ఇంటిముందు హడావిడిగా ఉంది. ఎవరో అతన్ని మంచానికి కట్టివేశారు. వరండా మూలలో దుడ్డుకర్ర లేదు. అతని మంచం దగ్గరుంది. అతని కుడిచేయి సరిగా లేదు. మణికట్టు పైన విరిగిపోయింది అంతే మరే దెబ్బలేదు. నలుగురూ చేరిన తరవాత అతనికి స్పృహ వచ్చింది రాముడూ, చిదంబరం అక్కడికి వెళ్ళేసరికి మునసబు భార్య ఏడుస్తూంది. ఎవరో కట్టు విప్పుతున్నారు. అప్పుడు నిద్రలేచాడు గురవయ్య చిదంబరం మునసబు మంచంవైపు చూశాడు. చేతులు తలవైపు పట్టెకూ, కాళ్ళు కాళ్ళకట్టకూ కట్టివేయబడ్డాయి! ముళ్ళు! నేర్పరయిన ముళ్ళు! చక్కని ముళ్ళు! ఏనుగు ముళ్ళు! అతనికి ఊరబావి గిలకల పట్టెలకు మోకులు వేసిన ముళ్ళు గుర్తుకు వచ్చాయి.

రాముడికి మునసబుమీద జాలివేసింది. కళ్ళు చెమ్మగిల్లాయి. "నొక్కటం రాగూడదనుకన్నాగానీ మీ కట్టం సూల్లేనుద్దొరా!' అన్నాడు. పెద్ద అదిగారు, ఎవరీపన్జేసింది?" అని "ఈళ్ళుమాత్రం గాదు." మునసబు చెప్పాడు' రాముడు, అంతపెద్దవాడు, అవురుమని ఏడ్చాడు. అందుకు ఎదుటివాళ్ళ కష్టంతోపాటు తమ కష్టం గుర్తుకు రావటం కావచ్చు.

పల్లె కవతల, సమాధుల దొడ్డి దగ్గిర, ఆపైన, ఆకాశం అంతా కావురు కమ్మింది. తెల్ల బూడిదలో కలిపిన కుంకుమ సుడిగాలి వచ్చి ఆకాశంలోకి ఎగిరిపోతే ఎట్లా ఉంటుందో అలాగే ఉంది మునసబు తలఎత్తి చూశాడు. నా వాంవులు తగిలడతన్నాయ్. పొండి. పోయి అర్పండి గొడ్డకి నోటికాడ మేతబోద్ది!" అన్నాడు. ఎందుకో అందరికీ అది నిజమే ననిపించింది కొందరు పరుగెత్తుకు పోయారు. వాళ్ళతోపాటే రాముడూ, చిదంబరమూ వెళ్ళారు వాములార్పటం సాధ్యం కాలేదు. బస్తీ ఫైరింజన్ వాళ్ళకు కబురు చేయటంకోసం ఎవరో స్టేషన్‌కు పోయారు.

సత్యనారాయణ, నాంచారయ్య మునసబును చూడటానికి పోలేదు. 'ఆళ్ళకి నేనంటే కోపం' అనుకొన్నాడు మునసబు. అతని అవజీవాలు

కుంగిపోయాయి. ఒక్క రాత్రితో మనిషి పదేళ్ళు గడిచిన వాడయ్యాడు. గురవయ్య మళ్ళీ నిద్రపోలేదు. మంచం పక్కనే కూర్చున్నాడు జీవితంలో ఎప్పుడూ కంట తడిపెట్టని మునసబు కళ్ళలో తిరిగే నీళ్ళు చూడలేక పోయాడు. తెల్లవారింది. తెల్లవారినా, రావణాసురుడి కాష్టంలా వాములు కాలుతూనే ఉన్నాయి. అప్పుడే ఫైరింజన్లు వచ్చాయి. అరగంట నీళ్ళకోసం తిరిగాయి.

తెల్లవార్లూ వెలుగుతూవున్న దీపం శారెడు ప్రొద్దెక్కినా రాముడింట్లో పెద్దదికాలేదు ఆడవాళ్ళిద్దరూ నిద్రపోతూనే ఉన్నారు.

ఉదయమే వచ్చే రైలులో మునసబును బస్తీకి తీసుకపోయారు. బావిలో ఎద్దుదట్టెం మురుగుతూఉంది

మధ్యాహ్నానికి ఫైరింజన్లు వాములార్పాయి. ఆర్పింది గడ్డి తగలడ కుండాకాదు. బూడిద కొట్టుకుపోకుండా! రాముడూ, చిదంబరం తిరిగి మునసబు ఇంటికి వచ్చారు. "మీరెందుకు ఇంటికి బోండిరా'' అని ఎవరో అంటే, ''యాఁవయినా అయితే మా నెత్తికి జుట్టుకొంటది, మేం బోం, పైగా మునుసోబుగారు మమ్మల్ని బొమ్మనలేదు'' అన్నాడు రాముడు.

ఇద్దరూ ప్రహరీ లోపల గోడకానుకూర్చున్నారు. ఒళ్ళంతా నొప్పులు! కడుపులో ఆకలి!

ప్రక్క ఊరు పనివాళ్ళు, మేమాపని చేయటానికి రామంటే ఏం చేయాలో దిక్కుతోచలేదు ఊరి పెద్దలకు. బావిలో దట్టెం బావిలోనే ఉంది.

ఎడం చేతికి పైన చిదంబరం తల పగిలింది అక్కడే తల పగిలిన యువకుడు కట్టునుగూర్చి ఎవరడిగినా, సావిడి బొంగు పొడుచుకొందని చెప్పాడు తండ్రీకొడుకుల్ని కొట్టిన మునసబు కుడిచేయి విరిగిపోయింది

ఊరి పెద్దలు కరణం ఇంటి దగ్గిర కలుసుకున్నారు. ఏంచేయాలో ఆలోచించుకొంటున్నారు నిన్న ఉదయంనించి జరిగిన సంగతులు పరిశీలించు కొంటున్నారు. ఇది ఒక్కడి పనికాదు. పల్లె అంతా కలిసిచేసింది వాళ్ళు పెచ్చుమీరిపోయారు ఏదయినా తెగిందాకా లాగకూడదు అంచేత ఆ బావి

సంగతి పట్టించుకోకూడదు! ఏమయినాసరే అంతు తేల్చుకోవలసిందే! ఇవాళ ఇదయింది, రేపు ఇంకొకటవుతుంది దేనికయినా హద్దుండాలి. కొంచెం అలుసు ఇస్తే వాళ్ళకు పట్ట పగ్గాలుండవు అవసరం అయితే తన్నయినా తోవలోకి తీసుకురావాలి. పెద్దవాళ్ళు, వయస్సులో చిన్నవాళ్ళే అయినా అనుభవంలో పెద్దవాళ్ళు. చిన్నవాళ్ళు వయసులో పెద్దవాళ్ళయినా ఆలోచనలో చిన్నవాళ్ళు అన్నారు. చివరకు కొట్లాట జరిగినా, దౌర్జన్యాలు జరిగినా, నష్టపోయేది ఎక్కువగా ఊళ్ళోవాళ్ళేననీ, చావు మూడినా, వాళ్ళు పల్లె వదలి వెళ్ళిపోయినా, జైళ్ళలో పడినా కష్టం కలిగేది ఉరివాళ్ళకేననీ, అందుచేత తాడూ బొంగరం లేని వాళ్లతో గొడవ పెంచుకోవటం మంచిదికాదనీ, ఆ విషయమే మునసబుతో చెబుదామనీ అందరూ నిర్ణయించుకొన్నారు.

సత్యనారాయణ అంతా వింటూ ఉన్నాడు పల్లెవాళ్ళు భయంవల్ల, ఊరు వదలిపోయి బ్రతకలేమన్న భయంవల్ల అణిగిమణిగి ఉంటున్నారు ఊరివాళ్ళు భయంవల్ల, నష్టపోతామనే భయంవల్ల తమకు కష్టం కలుగుతుందన్న భయంవల్ల, వ్యవసాయపు కూలీలు దొరకవన్న భయంవల్ల సర్దుకొంటున్నారు. భయంవల్ల పల్లెవాళ్ళు, ఊరివాళ్ళు మంచిగా ఉండాలనుకొంటున్నారు భయంవల్ల అహింసాపరులు కాబోతున్నారు. ప్రేమవల్ల కాదు, హార్దికంగా కాదు, అర్థం చేసుకొనికాదు, ఆనందం కోరికాదు, భయంవల్ల! భయంవల్ల!

భయం ప్రాతిపదిక మీద బ్రతుకుతున్న ఈ ఊరు, ఈ దేశం, ఎంత కాలం జీవిస్తాయి? ప్రేమ ప్రాతిపదిక మీద బతికేసమాజం, వ్యవస్థ ఏ రోజు పుడతాయి? పోనీ నిర్భయంగా జీవించే మానవజీవితం ఎంతదూరంలో ఉంది?

రెండోరోజు ఉదయం చేతికి పిండికట్టుతో రైలు దిగిన మునసబు సరాసరి ఇంటికి తీసుకుపోబడ్డాడు. నాంచారయ్య కనిపించి పరామర్శచేస్తే "ఆ బాయి సంగతి మనకొద్దు! ఆళ్లనే యాఁవన్నా జేసుకోఁవను" అన్నాడు.

"నువ్ బొమ్మన్నదాకా ఆళ్ళింటికి బోరంట."

"రేయ్, మీరింటికి బోండిరా! ఆ బాయి వాడుకోండి."

రాముడూ, చిదంబరం పల్లెవైపు సాగారు. అప్పుడే వచ్చిన ఊరి పెద్దలు తమకూ అదే ఇష్టం అని చెప్పారు.

ఇంటి ముందు పందిట్లో దిగాలుపడి కూర్చున్న చిదంబరం భార్య, నిన్నటినుంచి అన్నం, నీళ్ళు ముట్టుకోని ఆమె భర్తనూ, మామనూ చూచి, వెయ్యేనుగుల బలంతో వాళ్ల కెదురు పోయింది. వాళ్ల దెబ్బలు చూచి పెదవులు కొరుక్కుంది. భర్త తల వంచుకొన్నాడు. మామ, "ఏం ఫర్వాలేదులే" అన్నాడు ఇంట్లోకి వచ్చారు. పల్లెలో వాళ్ళంతా ఆ ఇంటి చుట్టూ మూగారు. బావి సంగతి విన్నారు. అయినా ఎవరూ కదల్లేదు. "యేం?" అంటే "బాయి బలిగోరిందంట, మనకొద్దది, ఇట్లా జంపాలని జూత్తన్నారీళ్ళు!" అన్నారు. చిదంబరం భార్య నిట్టనిలువునా వణికి పోయింది ఎగాదిగా అందరి ముఖాలలోకి చూచింది తల వెంట్రుకలు విదిలించి ముడి వేసుకొంది. "అట్టానా! అట్టానేనా? యేంది? అట్టాగేనా? అయితే అవునా! నేనే బలౌతా! నేనే బలౌతా!" రెండు అంగల్లో దున్నల దగ్గిరకు పోయింది మెడ పలుపులు విప్పింది కాడి మెడలమీద వేసింది. "యేందే నీ గోల!" భర్తమాట వినిపించుకోలేదు. దున్నలకు పట్టెళ్ళు బెట్టింది అదిలించింది బావివైపు వెళ్ళాయి. "యేందే యిది!" భర్త అన్నాడు.

"నువ్వుండు!" భర్తతో చెప్పింది చీర తిప్పి గోచి పెట్టుకొంది చేంతాడు బావిలోకి వేసింది. పై కొన గిలకల పట్టెకు కట్టింది మెట్ల మీదుగా బావిలోకి దిగింది ఎద్దుదట్టెం కాళ్ళకు కట్టి ఉన్న మోకుల కొసలు చేత బట్టుకొంది. పైకి వచ్చింది ఒక పక్క ఉన్న రెండు మోకులు ఒక పక్క గిలకల పట్టెకు కట్టింది రెండోపక్కకున్న రెండు మోకులు గిలికల మీదవేసి, దున్నల మెడల మీద ఉన్న కాడికి కట్టింది పట్టెళ్ళు బిగించింది. వడుగుల రెండు దున్నల్ని రెండు చేతులతో చాచికొట్టింది. చేయి మీదవేస్తే ఆగని దున్నలు ఒక్క దూకులో ముందుకు వెళ్ళాయి. క్షణంలో దట్టెంపైకి వచ్చింది రాముడు, చిదంబరం ఒకరి ముఖాలొకరు చూచుకొన్నారు. ఇద్దరూ వెళ్ళారు రెండు వేప నిట్టాళ్ళు తీసుకువచ్చారు. అప్పుడందరివైపు చూచింది వింతగా అందరూ చూస్తున్నారు. "మీలో మొగోళ్ళు లేరా! అంతా ఆడోళ్లేనా? మొగోళ్ళుంటే రండి. సాయం సెయ్యండి" అంటూ

అరిచింది చిదంబరం భార్య. రాముడూ రెండు నిట్టాళ్ళూ, ఒక గిలకల పట్టె మీద నుంచి ఎద్దుదట్టెం వెనుపూస కిందగా, మరో గిలకల పట్టెమీదికి, దట్టెం ఎగదట్టేట్టుగా పెట్టించాడు పల్లెవాళ్ళు తాళ్ళు పట్టుకొన్నారు రెండోవైపు రెండు మోకులు విప్పివేశారు ఆమె దున్నల్ని అదిలించింది ఒక్క ఉదుటన దట్టెంవచ్చి వెలుపల పడింది ఆ దున్నలు అలాగ్గే ఎద్దుదట్టెం ఊరి వెలుపలికి ఈడ్చుకుపోయాయి.

చిదంబరం ఇందాకటినుంచి ఆలోచిస్తున్నాడు బావిలోంచి మోకులు తెచ్చి ఆమె పట్టెకు వేసిన ముళ్ళు గూర్చి. చక్కని ముళ్ళు! అందమయిన ముళ్ళు! నేర్పుగల ముళ్ళు! ఏనుగు ముళ్ళు!

"నీళ్ళు పాడయిపోయాయి. తోడి పారబోసి పూడిక తీసుకొందాం. బావికి" అన్నాడు రాముడు. పల్లెవాళ్ళు చిన్నాపెద్దా పోగయ్యారు. చేంతాళ్ళు, కడవలు, బిందెలు, మోటలు, తట్టలు పారలు, పొలుగులు బావి దగ్గిరికి చేరాయి. పని చకచకా సాగిపోతూ ఉంది పండుగ ఉత్సాహంతో ఉంది పల్లె! ఊరిజనం ఇళ్ళ ముందు మంచే చూస్తున్నారు. ఇంత జరుగుతున్నా అందరికి ఆ దట్టెం బావిలోకి ఎలావచ్చిందో ఏకగ్రీవంగా అర్థం కాలేదు. చిదంబరం ఇంట్లోకి పోయి ఆమె చెప్పులు చూశాడు. దుమ్ముకొట్టుకుని ఉన్నాయి. గరువుదుమ్ము! రేగడి దుమ్ము! వింతరంగు కలగాపులగంగా కలిసిపోయింది. అంతలో చిదంబరం భార్య దట్టెం పల్లె వెలుపల పోరంబోకులో వేపచెట్టు కింద వదలి దున్నల్ని తోలుకువచ్చింది. చిదంబరం అటకమీద ఉండవలసిన నాలుగు బండి మోకులూ కనిపించక పోయేసరికి భార్యముఖంలోకి చూశాడు.

నీళ్ళు తోడి పారబోశారు. పూడిక తీశారు. కొత్త నీరు ఊరుతూ వుంది. బావిలో ఉన్నవాళ్ళు పైకి ఎక్కివచ్చారు. "పిల్లలు నాకు రొండణాలు దొరికాయి. నాకు పావలా!" అంటున్నారు.

"ఈ ఇత్తడి చెంబు ఎవుళ్ళదో!" "ఈ కడవ పగల్లేదు, సూశావా!" "ఈ బాడు నాదే" అంటూ బావిలోనుంచి దొరికిన సొమ్ములు గూర్చి వరదాగా చెప్పుకొంటున్నారు.

చిదంబరం భార్య, రాముడి కోడలు, ఆమె, కథవా తాడు తెచ్చి కడవ మునిగేంతవరకు ఊరిన నీళ్ళలోనించి ఊరబావి నీళ్ళు కడవెడు తోడుకొని, రెండు రోజులనించి పొయిలోనుంచి లేవని పిల్లిని లేపటంకోసం, తీసుకు పోయింది. పల్లెవాళ్ళు నీళ్ళు తోడుకొంటున్నారు. తాగుతున్నారు. స్నానం చేస్తున్నారు.

ఊరు చూస్తూ ఊరుకొంది.

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 2-7-69, 9-7-69.

4)